మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు
దినపత్రిక
NETI EVARTHALU

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

బుధవారం WEDNESDAY 10-12-2025 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00
సంపుటి: 1 Volume:1 ‖ సంచిక: 161 Issue: 161

10 డిసెంబర్ 2025 - బుధవారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం - హేమంత ఋతువు మార్గశిర మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:39 సూర్యాస్తమయం - సా. 5:38 తిథిః షష్ఠి మ. 1:52 వరకు తరువాత సప్తమి సంస్కృత వారం సౌమ్య వాసరః నక్షత్రం మఖ రా. 2:43ం వరకు తరువాత పూర్వ ఫల్గుని(పుబ్బ) యోగం వైధృతి మ. 12:41 వరకు కరణం వనిజ మ. 1:52 వరకు విష్టి రా. 1:49ం వరకు వర్జ్యం మ. 2:33 నుండి సా. 4:10 వరకు దుర్ముహూర్తం ఉ. 11:46 నుండి మ. 12:30 వరకు రాహుకాలం మ. 12:08 నుండి మ. 1:31 వరకు యమగండం ఉ. 8:01 నుండి ఉ. 9:24 వరకు గుళికాకాలం ఉ. 10:46 నుండి మ. 12:08 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:03 నుండి తె. 5:51 వరకు అమృత ఘడియలు రా. 12:17 నుండి రా. 1:55 వరకు అభిజిత్ ముహూర్తం లేదుః గమనిక: "ం" అనగా మరుసటి రోజున

Published from Jagitial
www.evarthalu.com




## 12న తాండవమే!

అఖండ2 విడుదలకు మార్గం సుగమం



## ప్రభాస్ సేఫ్

టోక్యో: టాలీవుడ్ ప్రముఖ నటుడు, డార్లింగ్ ప్రభాస్ జపాన్ లో పర్యటిస్తున్నారు. ఈ నెల 12న 'బాహుబలి: ది ఎపిక్' జపాన్ లో విడుదల కానుంది. సినిమా ప్రచారం కోసం జపాన్ వెళ్లిన ప్రభాస్.. అక్కడి అభిమానులతో కలిసి సందడి చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే జపాన్ లో పెను భూకంపం సంభవించిందనే వార్తలతో ప్రభాస్ అభిమానుల్లో ఆందోళన నెలకొంది. తమ హీరో ఎలా ఉన్నారోనని ఆందోళన చెందుతూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. ఓ అభిమాని డైరెక్టర్ మారుతిని ట్యాగ్ చేస్తూ 'జపాన్‌లో భూకంపం వచ్చింది. సునామీ హెచ్చరికలు జారీ చేశారు. మా హీరో ఎక్కడ, ఎలా ఉన్నాడు?' అని ప్రశ్నించాడు. దీనికి మారుతి స్పందిస్తూ.. 'ప్రభాస్‌తో ఇప్పుడే మాట్లాడాను. ఆయన క్షేమంగా ఉన్నారు. ఆందోళన చెందకండి' అని జవాబిచ్చారు.



# అంతా సోనియమ్మే

### ఆమె పుట్టిన రోజునే రాష్ట్ర ఏర్పాటు ప్రకటన

### అందుకే తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవం

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టీకరణ

### జిల్లాల్లో తెలంగాణ తల్లి విగ్రహాల ఆవిష్కరణ



కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియాగాంధీ వల్లే తెలంగాణ సాకారమైందని, ఆమె పుట్టిన రోజునే రాష్ట్ర ఏర్పాటు ప్రకటన వచ్చిందని.. ఇది కలకాలం గుర్తుంటుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆరు దశాబ్దాల తెలంగాణ ప్రజల ఆకాంక్షను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చిందని చెప్పారు. ఫ్యూచర్ సిటీలోని తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ వేదికగా.. సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ తల్లి విగ్రహాలను వర్చువల్ గా ఆవిష్కరించారు. రాష్ట్రంలోని 33 కలెక్టరేట్లలో రూ.5.8 కోట్లతో తెలంగాణ తల్లి విగ్రహాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

హైదరాబాద్, డిసెంబర్ 9 (ఈవార్తలు): 18 అడుగుల ఎత్తుతో రాష్ట్రంలోని అన్ని కలెక్టోరేట్లలో తెలంగాణ తల్లి విగ్రహాల ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. సోనియా గాంధీ పుట్టిన రోజున.. డిసెంబర్ 9న తెలంగాణ రాష్ట్ర ప్రకటన చేసిన రోజని.. ఇది కలకాలం గుర్తుంటుందని పేర్కొన్నారు. 4 కోట్లమంది ప్రజల ఆకాంక్షను గౌరవిస్తూ నిర్ణయం తీసుకున్న రోజును.. తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవంగా నిర్ణయించామని తెలిపారు. స్వరాష్ట్ర ఏర్పాటు తర్వాత సంక్షేమం, అభివృద్ధిలో తరువాయి 2 వ పేజీలో...

## పౌరసత్వం రాకముందే ఓటెలా?

### సోనియాకు ఢిల్లీ కోర్టు నోటీసులు

### ఢిల్లీ ప్రభుత్వానికీ తాఖీదులు జారీ



న్యూఢిల్లీ: భారత పౌరసత్వం రాకముందే కాంగ్రెస్ పార్టీ మాజీ చీఫ్ సోనియా గాంధీ ఓటు హక్కు పొందారన్న వివాదంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. సోనియా గాంధీకి ఢిల్లీలోని రౌస్ అవెన్యూ సెషన్స్ కోర్టు నోటీసులు జారీ చేసింది. సోనియా గాంధీకి ఓటు హక్కు విషయంలో దాఖలైన పిటిషన్ విచారణకు స్వీకరించిన కోర్టు.. వివరణ ఇవ్వాలంటూ తాజాగా సోనియాను ఆదేశించింది. భారతపౌరసత్వం -2 వ పేజీలో...



## అన్ని రాష్ట్రాలు 'సర్' అనాల్సిందే

### ప్రక్రియ సజావుగా జరగాల్సిందే

### బీఎల్‌వోలను బెదిరిస్తే మా వద్దకు రండి

### సుప్రీం కోర్టు స్పష్టీకరణ

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియను ప్రతి రాష్ట్రం తప్పనిసరిగా కొనసాగించాల్సిందేనని భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాలు ఎస్ఐఆర్‌ను వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో, ఆ సవరణను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు మంగళవారం విచారణ జరిపింది.

న్యూఢిల్లీ: ఈ సందర్భంగా ఎస్ఐఆర్ నిర్వహణలో ఎదురవుతోన్న పరిస్థితులను పిటిషనర్లు కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. పిటిషన్లపై విచారణ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. బెంగాల్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగమైన బీఎల్ఓ (బూత్ లెవల్ అధికారులు), ఇతర తరువాయి 2 వ పేజీలో...

## 1.5 లక్షల కోట్లు

### భారత్‌లో పెట్టుబడిని ప్రకటించిన మైక్రోసాఫ్ట్

### ప్రధాని మోదీతో భేటీ అనంతరం సత్య నాదెళ్ల వెల్లడి

### ఆసియాలోనే ఇదే అతిపెద్ద పెట్టుబడి అని ప్రకటన

ప్రముఖ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ భారత్‌లో అత్యంత భారీ పెట్టుబడికి సిద్ధమైంది. దేశంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగాన్ని బలోపేతం చేసేందుకు ఏకంగా రూ.1.5 లక్షల కోట్లు (17.5 బిలియన్ డాలర్లు) పెట్టుబడిగా పెట్టనున్నట్లు ప్రకటించింది. మంగళవారం ప్రధాని నరేంద్ర మోదీతో మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల సమావేశమైన అనంతరం ఈ కీలక ప్రకటన వెలువడింది. ఆసియాలోనే మైక్రోసాఫ్ట్ పెడుతున్న అతిపెద్ద పెట్టుబడి ఇదేనని సత్య నాదెళ్ల తెలిపారు.

న్యూఢిల్లీ: రానున్న నాలుగేళ్లలో (2026-2029) ఈ నిధులను వెచ్చించనున్నట్లు కంపెనీ పేర్కొంది. ఈ పెట్టుబడి ద్వారా భారత్‌లో ఏఐకి అవసరమైన మౌలిక సదుపాయాలు, నైపుణ్యాల అభివృద్ధి, సామర్థ్యాల పెంపునకు కృషి చేస్తామని ఆయన వివరించారు. ఈ సమావేశంపై సత్య నాదెళ్ల ఎక్స్ వేదికగా స్పందిస్తూ, "భారత్ ఏఐ తరువాయి 2 వ పేజీలో...



## మార్చి 14 నుంచి టెన్త్ పరీక్షలు



### ప్రతి పరీక్షకు 4 రోజుల గ్యాప్

### విద్యాశాఖ టైంటేబుల్ విడుదల


రాష్ట్రంలో 2025 - 26 విద్యా సంవత్సరానికి సంబంధించి పదో తరగతి పబ్లిక్ పరీక్షల టైం టేబుల్ మంగళవారం విడుదలైంది. తాజా షెడ్యూల్ ప్రకారం మార్చి 14 నుంచి ఏప్రిల్ 13 వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. తొలుత ఇంటర్ పరీక్షలు ఫిబ్రవరి 25 నుంచి మార్చి 13 వరకు జరగనున్నాయి. ఆ తర్వాత మార్చి 14 నుంచి పదో తరగతి పరీక్షలు నిర్వహించాలని విద్యాశాఖ అధికారులు నిర్ణయించారు.

హైదరాబాద్, డిసెంబర్ 9 (ఈవార్తలు): ఈసారి పదవ తరగతి పరీక్షల్లో సమయంలో హాలిడేస్ రావడంతో ఒక్కో పరీక్షకు ఎక్కువ గ్యాప్ వచ్చింది. ప్రతి పరీక్ష ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 వరకు నిర్వహించినున్నారు. సైన్స్ పేపర్ రెండు భాగాలుగా రెండు రోజులు జరగనున్న నేపథ్యంలో ఉదయం 9:30 నుంచి 11 గంటల తరువాయి 2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.12,944 |
| వెండి (గ్రాము): | రూ.199 |
| ప్లాటినం (గ్రాము): | రూ.4,765 |

## విశ్వవాణి



అమెరికాలో ప్రతి పది మంది యువతలో ఏడుగురు ఆర్థిక పరిస్థితులను తలుచుకుంటూ నిద్రనే పోవడం సరిగా నిద్రపోవడం లేదని తాజా అధ్యయనంలో తేలింది. నడి నిద్రలో లేచి ఆర్థిక స్థితిగతులను గుర్తుచేసుకుంటున్నారని వెల్లడైంది. ముఖ్యంగా ఈ పరిస్థితి జనరేషన్ జెడ్‌లో ఎక్కువగా కనిపిస్తోందని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.



## ఇండిగో సర్వీసుల్లో 5% కోత

### రోజువారీ కార్యకలాపాలపై కేంద్రం చర్యలు

### సంస్థపై కఠిన చర్యలు తప్పవు: రామ్మోహన్ నాయుడు

న్యూఢిల్లీ: దేశంలో అతిపెద్ద విమానయాన సంస్థ ఇండిగో కార్యకలాపాలు క్రమంగా సాధారణ స్థితికి చేరుకుంటున్నాయని, అయితే ప్రణాళికా లోపాల కారణంగా ప్రయాణికులకు కలిగించిన తీవ్ర ఇబ్బందులకు సంస్థను బాధ్యుల్ని చేస్తామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. మంగళవారం లోక్‌సభలో ఆయన మాట్లాడుతూ, నిబంధనలు పాటించని ఏ ఎయిర్‌లైన్స్ సంస్థను ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ సంక్షోభం నేపథ్యంలో డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ), ఇండిగోకు షోకాజ్ నోటీసులు జారీ చేసిందని, దీనిపై సమగ్ర విచారణ జరుగుతోందని

## నీలాంటి కుక్కల్ని మస్తు జూసిన

### నువ్వు ఏ బంగారం దుకాణాన్ని వదల్లేదు

### మంత్రి పదవులు ఎంతకు అమ్ముకున్నవో తెల్సు

### బండారం బయటపెడితే బయట తిరగలేవు

### కేసీఆర్‌పై అభిమానంతో సైలెంట్‌గా ఉన్నం

### కవితపై ఎమ్మెల్యే కృష్ణారావు ఘాటు వ్యాఖ్యలు



'నీలాంటి కుక్కల్ని మస్తు జూసిన' అంటూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుమార్తె కల్వకుంట్ల కవితపై కూకట్‌పల్లి బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సంచలన వ్యాఖ్యలు చేశారు. కవిత సోమవారం కూకట్‌పల్లి నియోజకవర్గంలో పర్యటించి.. నియోజకవర్గ అభివృద్ధిపై విమర్శలు చేశారు.

కూకట్‌పల్లి/హైదరాబాద్, డిసెంబర్ 9 (ఈవార్తలు): దీనికి కౌంటర్‌గా కృష్ణారావు ఘాటు వ్యాఖ్యలు చేయటం గమనార్హం. కవిత సోమవారం జాగృతి జనం బాట కార్యక్రమంలో భాగంగా కూకట్‌పల్లిలో పర్యటించి వై జంక్షన్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. కూకట్‌పల్లి హైదరాబాద్‌కు కామధేనువుగా మారిందని ఇక్కడ సుమారు రూ. 2,000 కోట్ల రూపాయల విలువైన భూములను గత ప్రభుత్వం విక్రయించినప్పటికీ కూకట్‌పల్లి నియోజకవర్గ అభివృద్ధి కోసం కనీసం ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని ఆమె విమర్శించారు. కవిత చేసిన విమర్శలకు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అదే స్థాయిలో, వ్యక్తిగత ఆరోపణలతో కౌంటర్ ఇచ్చారు. కవిత చరిత్ర ఏంటో తనకు బాగా తెలుసునని, ఆమె ఏ బంగారం దుకాణాన్ని వదల్లేదని ఆయన తీవ్రంగా ఆరోపించారు. కవిత సంగతి.. ఆమె భర్త సంగతి తనకు పూర్తిగా తెలుసునని అన్నారు. 'మంత్రి పదవులు ఎంతకు అమ్ముకున్నావో అందరికీ తెలుసు. నీ బండారం బయటపెడితే నువ్వు బయట కూడా తిరగలేవు' అని కృష్ణారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్‌పై తరువాయి 2 వ పేజీలో...

## రష్యా రమ్మంది!

### విదేశీ వృత్తి నిపుణులకు ఆఫర్

### తాత్కాలిక/శాశ్వత నివాసానికి చాన్స్

### భారతీయులే టార్గెట్‌గా కొత్త వీసాలు



మాస్కో: విదేశీ నిపుణులను ఆకర్షించడానికి రష్యా కొత్త వీసా కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. ఈ కొత్త వీసా ద్వారా వివిధ రంగాల్లో నైపుణ్యాలను కలిగిన వ్యక్తులు రష్యాలో మూడేళ్లపాటు తాత్కాలిక లేదా శాశ్వత నివాసం పొందవచ్చు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఇటీవల భారత్‌లో పర్యటించిన విషయం తెలిసిందే. ఈ పర్యటనకు ముందే, సంబంధిత ఉత్తర్వులపై తరువాయి 2 వ పేజీలో...



## అమెరికా పొమ్మంది!

### భారతీయులే లక్ష్యంగా ట్రంప్ చర్యలు

### టారిఫ్‌లతో ఇబ్బంది పెట్టే కుయుక్తులు

### తాజాగా భారత్ బియ్యంపై టారిఫ్‌లు

# రాశి ఫలాలు

9.12.2025

మేషం: ఉద్యోగ ప్రయత్నాలు అనుకూలంగా సాగుతాయి. ఆకస్మిక ధనలాభ సూచనలున్నవి. కుటుంబ వాతావరణం సంతృప్తికరంగా ఉంటుంది. బంధు, మిత్రులతో విందు వినోద కార్యక్రమాలలో పాల్గొంటారు. సంఘంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. ఇంటా బయట అనుకూల వాతావరణం ఉంటుంది.

వృషభం: చేపట్టిన పనులలో అవరోధాలు తప్పవు. చిన్నపాటి ఆరోగ్య సమస్యలు బాధిస్తాయి. కొందరి ప్రవర్తన మానసికంగా చికాకు పరుస్తుంది. దూర ప్రయాణాలు వాయిదా పడుతాయి. సంతాన విద్యా ఉద్యోగ ప్రయత్నాలు మందకోడిగా సాగతాయి. ఉద్యోగమున స్థానచలన సూచనలున్నవి. ఆర్థిక పరిస్థితి నిరుత్సాహ పరుస్తుంది.

మిధునం: ఆర్థిక ఇబ్బందులను అధిగమించడానికి నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు. మాతృ వర్గ బంధు మిత్రులతో మాటపట్టింపులుంటాయి. వృత్తి ఉద్యోగాల్లో ఊహించని మార్పులు ఉంటాయి. సమాజంలో ప్రముఖులతో జాగ్రత్తగా వ్యవహరించాలి. కలహాలకు దూరంగా ఉండటం మంచిది.

కర్కాటకం: కుటుంబ పెద్దల ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. సమాజంలో గౌరవ మర్యాదలకు లోటు ఉండదు. ఆదాయ మార్గాలు పెరుగుతాయి. విందు వినోద కార్యక్రమాలకు ఆహ్వానాలు అందుతాయి. దూర ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. సోదరులతో గృహమున సంతోషంగా గడుపుతారు.

సింహం: నిరుద్యోగ ప్రయత్నాలు నిరుత్సాహ పరుస్తాయి. ఆర్థిక వ్యవహారాలు అంతంత మాత్రంగా ఉంటాయి. ముఖ్యమైన పనులు వాయిదా వేయడం మంచిది. దైవ చింతన పెరుగుతుంది. నేత్ర సంబంధిత అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. ఉద్యోగమున అధికారులతో చిన్నపాటి వివాదాలు ఉంటాయి.

కన్య: నూతన కార్యక్రమాలకు శ్రీకారం చూడతారు. ధన వ్యవహారాలు సజావుగా సాగుతాయి. అన్ని రంగాల వారికి అనుకూల ఫలితాలుంటాయి. పాత ఋణాలు తీర్చగలుగుతారు. మానసికంగా ప్రశాంతం ఉంటారు. నూతన వస్తు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు. సమాజంలో ప్రముఖుల పరిచయాలు ఉత్సాహనిస్తాయి.

తుల: సంతాన వివాహ విషయమై ప్రస్తావన వస్తుంది. నూతన వ్యాపారాలు ప్రారంభించిన లాభాలు అందుకుంటారు. వృత్తి, ఉద్యోగాలలో గందరగోళ పరిస్థితులుంటాయి. ఉద్యోగస్తులకు సహొద్యోగుల సహాయ సహకారాలు అందుతాయి. ఆకస్మిక ధనలాభ సూచనలున్నవి. కుటుంబ వాతవరణం ప్రశాంతంగా ఉంటుంది. సమాజంలో గౌరవ, మర్యాదలు పెరుగుతాయి.

వృశ్చికం: ఉద్యోగస్థులకు పదోన్నతులు పెరుగుతాయి. కుటుంబ పెద్దల ఆరోగ్యం విషయంలో శుభవార్తలు అందుతాయి. నిరుద్యోగ ప్రయత్నాలు అనుకులిస్తాయి. అవసరానికి చేతికి ధనం అందుతుంది. ఆధ్యాత్మిక విషయాలపై దృష్టి సారిస్తారు. దూర ప్రయాణ సూచనలున్నవి ఇతరులతో కలహాలకు దూరంగా ఉండటం మంచిది.

ధనస్సు: బంధు, మిత్రుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. వృత్తి వ్యాపారాలలో విశేష లాభాన్ని ఆర్జిస్తారు. ఉద్యోగమున అధికారుల ఆదరణ పెరుగతుంది. నూతన వస్త్రాభరణాలను కొనుగోలు చేస్తారు. సన్నిహితుల సహాయ సహకారాలతో కొన్ని పనులు పూర్తవుతాయి. ధనవ్యవహారాలు కొంత అనుకూలిస్తాయి.

మకరం: ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చేయడం మంచిది కాదు. దూర ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. ఆదాయ మార్గాలు మందగిస్తాయి. నూతన ఋణ ప్రయత్నాలు అంతగా కలిసిరావు. ఇంటా బయట గందరగోళ పరిస్థితులు ఉంటాయి. ఉద్యోగమున అధికారులతో చర్చలు అంతగా అనుకూలించవు.

కుంభం: సన్నిహితుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. జీవిత భాగస్వామితో పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. వ్యాపార, ఉద్యోగాలు ఆశించిన విధంగా సాగుతాయి. గృహ వాతావరణం ప్రశాంతంగా ఉంటుంది. చిన్ననాటి మిత్రులతో విందువినోదాలు కార్యక్రమాల్లో పాల్గొంటారు.

మీనం: నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. చేపట్టిన పనులలో జాప్యం కలిగినా అనుకున్న సమయానికి పూర్తి చేయగలుగుతారు. సమాజంలో గౌరవ మర్యాదలు లోటు ఉండదు. ఆకస్మిక ధనలాభ సూచనలున్నవి. కుటుంబ సభ్యులతో దైవ క్షేత్రాలు సందర్శించుకుంటారు.

# అంతా సోనియమ్మే

మొదటి పేజీ తరువాయి

దేశంలోనే నెంబర్ వన్‌గా మార్చామన్నారు. సోనియా, మన్మోహన్‌ను ఎప్పటికీ తెలంగాణ ప్రజలు మరువబోరని.. సీఎం రేవంత్ తెలిపారు. 6 దశాబ్దాల ప్రజల ఆకాంక్షలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. ఏటా డిసెంబరు 9న తెలంగాణ తల్లి ఆవిష్కరణ ఉత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఏటా తెలంగా ణ తల్లి అవతరణ దినోత్సవాలతో పాటు, సోనియా గాంధీ జన్మదిన ఉత్సవాలను తెలంగాణ ప్రజలు నిర్వహించుకుంటారని.. తెలంగాణ పథకాలు, కార్యక్రమాల్లో సోనియా గాంధీ, మన్మోహన్ స్ఫూర్తి కొనసాగుతోందని.. రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ అస్తిత్వానికి ప్రతీకగా, పరిపాలనకు స్ఫూర్తిదాయకంగా నిలిచే తెలంగాణ తల్లి విగ్రహాలను అన్ని జిల్లాల పరిపాలన కేంద్రాల్లో ఏర్పాటు చేసుకోవడం రాష్ట్ర చరిత్రలో గొప్ప సందర్భమని సీఎం అన్నారు.



### విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ

ఫ్యూచర్ సిటీలో జరుగుతున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో తెలంగాణ రైజింగ్ విజన్-2047ను సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. రెండు ప్రధాన అంశాలు, మూడు రీజియన్లు, త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీ లక్ష్యంతో ఈ డాక్యుమెంట్‌ను మంగళవారం రిలీజ్ చేశారు. పక్క రాష్ట్రాలతో కాదని, అభివృద్ధి చెందిన దేశాలతోనే పోటీ పడుతూ తెలంగాణను గ్లోబల్ హబ్‌గా తయారు చేయడమే లక్ష్యంగా ఈ డాక్యుమెంట్‌ను రూపొందించింది. 2047 నాటికి ఏ ప్రాంతాన్ని ఎలా అభివృద్ధి చేయాలి? ఏ ఏరియాలో ఏమేం పరిశ్రమలను ప్రోత్సహించాలి? ప్రపంచంలోనే అత్యుత్తమ కంపెనీలను రాష్ట్రానికి ఎలా ఆకర్షించాలనే దానిపై రోడ్ మ్యాప్‌ను ఆవిష్కరించారు. గత అనుభవాలు.. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని విజన్ 2047 డాక్యుమెంట్ తయారుచేశారు.

### విజన్ డాక్యుమెంట్‌లోని 10 అంశాలు:

- 2034 నాటికి వన్ ట్రిలియన్ డాలర్ల ఎకానమీ
- 2047నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ
- 2047నాటికి దేశ జీడీపీలో రాష్ట్ర వాటా 10 శాతం
- – నైపుణ్యాభివృద్ధి, ఉపాధి, మహిళా సాధికారత, పర్యావరణ సుస్థిరత సాధించడం.
- మెరుగైన జీవన ప్రమాణాలు, నెట్ జీరో రోడ్ మ్యాప్
- రేడియల్ రోడ్లతో మౌలిక వసతుల భారీ అప్‌గ్రేడ్
- డైనమిక్ గ్రోత్ ఇంజిన్‌గా తెలంగాణ అభివృద్ధి
- చైనా ప్లస్ వన్ వ్యూహంతో తయారీ రంగంలో భారీ అవకాశాలు
- ఎలక్ట్రానిక్స్, ఫార్మా, బయోటెక్ కోసం ప్రత్యేక జోన్లు
- యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు

# నీలాంటి కుక్కల్ని మస్తు జూసిన

మొదటి పేజీ తరువాయి

ఉన్న అభిమానంతోనే తాము ఇప్పటి వరకు కవితపై మాట్లాడలేదని స్పష్టం చేశారు. పార్టీలో కీలక నేత అయిన మాజీ మంత్రి హరీశ్ రావును పార్టీ నుంచి వెళ్లగొట్టాలని కవిత ప్లాన్ వేశారని ఆయన ఆరోపించారు. అంతేకాకుండా, కేటీఆర్‌ను అరెస్ట్ చేయించి ఆ తరువాత దోచుకు తినడానికే ప్లాన్ చేశారని మండిపడ్డారు. కవిత భర్త అక్రమాల చిట్టా తన వద్ద ఉందని కూడా కృష్ణారావు హెచ్చరించారు. కవిత లిక్కర్ క్వీన్ అని.. అందుకు ఆమె ఇంట్లో పెరుగుతున్న పెంపుడు కుక్కే నిదర్శనమన్నారు. ఆ కక్కకు ఆమె విస్కీ అని పేరుపెట్టారని.. దీన్నిబట్టే ఆమె లిక్కర్ వ్యాపారం గురించి అర్థం చేసుకోవచ్చునని అన్నారు. కాగా, కవితను బీఆర్ఎస్ పార్టీ సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. పార్టీ వ్యతిరేక కార్యకలపాలకు పాల్పడుతున్నారని రెండు నెలల క్రితం ఆమెను అధినేత కేసీఆర్ సస్పెండ్ చేసారు. ఆ తర్వాత ఆమె జాగృతి పేరుతో కార్యకలపాలు సాగిస్తున్నారు. జనం బాట పేరుతో రాష్ట్రవ్యాప్త పర్యటనకు వెళ్లారు. గతంలో హరీశ్ రావుపై.. ఇటీవల మాజీ మంత్రి మల్లారెడ్డిపైనా అవినీతి ఆరోపణలు చేశారు. దీంతో తాజాగా మాధవరం కృష్ణారావు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు.



# ఇండిగో సర్వీసుల్లో 5% కోత

మొదటి పేజీ తరువాయి

మంత్రి తెలిపారు. నివేదిక ఆధారంగా కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మరోవైపు ఇండిగో తన రోజువారీ సర్వీసుల్లో 5 శాతం కోత విధించాలని డీజీసీఏ ఆదేశించింది. షెడ్యూళ్లను సమర్థంగా నిర్వహించడంలో ఇండిగో విఫలమైందని డీజీసీఏ తన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇప్పటికే ప్రయాణికులకు రూ.750 కోట్లకు పైగా రిఫండ్ చేసినట్లు ఇండిగో తెలిపిందని రామ్మోహన్ నాయుడు సభకు వివరించారు. ఈ నెల 5 నుంచి 15 వరకు రద్దయిన విమానాల రిఫండ్లు, బ్యాగేజీ సమస్యలు మంత్రిత్వ శాఖ పర్యవేక్షణలో ఉన్నాయన్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని ప్రయాణికులను ఆదుకోవడానికి విమాన టికెట్ల ధరలపై పరిమితులు విధించిందని, ఎలాంటి అదనపు ఛార్జీలు లేకుండా రీబుకింగ్‌లు చేశారని తెలిపారు. పైలట్లు, సిబ్బంది రోస్టరింగ్ నిబంధనల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. మంత్రి ప్రకటన అనంతరం కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్షాలు సభ నుంచి వాకౌట్ చేశాయి. దేశంలో పటిష్ఠమైన, ప్రయాణికులే ప్రథమ ప్రాధాన్యతగా ఉండే విమానయాన రంగాన్ని నిర్మించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు.

# పౌరసత్వం రాకముందే ఓటెలా?

మొదటి పేజీ తరువాయి

పొందడానికి మూడేళ్ల ముందే సోనియా గాంధీ ఓటరుగా నమోదు చేసుకున్నారని పిటిషనర్ ఆరోపించారు. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ కోర్టును ఆశ్రయించారు. దీంతో తాజాగా సోనియా గాంధీతో పాటు రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసిన కోర్టు.. ఈ కేసు తదుపరి విచారణను వచ్చే నెల 6కు వాయిదా వేసింది. వివరాల్లోకెళితే.. ఇటలీ పౌరురాలైన సోనియా గాంధీ భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీతో వివాహం తర్వాత భారత పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకున్నారు. 1983 ఏప్రిల్ 30న ఆమె భారత పౌరసత్వాన్ని పొందారు. అంతకుముందే.. అంటే 1980 నాటికే ఢిల్లీ ఓటరు జాబితాలో సోనియా గాంధీ పేరు ఉందని పిటిషనర్, బీజేపీ నాయకులు ఆరోపిస్తున్నారు. భారత పౌరసత్వం పొందకముందే ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవడం ఎన్నికల చట్టాల ఉల్లంఘనేనని విమర్శిస్తున్నారు. ఓటు హక్కు కోసం సోనియా గాంధీ నకిలీ పత్రాలు సమర్పించి ఉండొచ్చని ఆరోపణలు వినిపిస్తున్నాయి. 1980లో సోనియా గాంధీ పేరును ఓటరు జాబితాలో చేర్చిన తర్వాత తిరిగి 1982లో తొలగించారని, ఆపై 1983 జనవరిలో తిరిగి ఓటరు జాబితాలో చేర్చారని పిటిషనర్ ఆరోపించారు. దీనిపైనే కోర్టు ఆమెకు నోటీసులు జారీచేసింది.

# అన్ని రాష్ట్రాలు 'సర్' అనాల్సిందే

మొదటి పేజీ తరువాయి

అధికారులకు బెదిరింపులు వస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని సుప్రీంకోర్టు తెలిపింది. ఈ ఘటనలను తీవ్రంగా పరిగణిస్తున్నామని, వీటిని తమ దృష్టికి తీసుకురావాలని లేకపోతే గందరగోళ పరిస్థితులు ఎదురయ్యే అవకాశం ఉందని హెచ్చరించింది. బీఎల్ఓలకు బెదిరింపులు వస్తే, ఎస్ఐఆర్ ప్రక్రియలో అంతరాయాలు ఏర్పడితే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని, వారి భద్రతకు సంబంధించి తగిన ఆదేశాలు జారీ చేస్తామని స్పష్టం చేసింది. బీఎల్ఓలు ఒత్తిడికి గురైతే వారి స్థానంలో వేరే వారిని తీసుకోవడం వంటి పరిష్కార మార్గాలను అనుసరించాలని సూచించింది. ఎస్ఐఆర్ ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ఆదేశాలు జారీ చేసింది. ఈ ప్రక్రియ నిర్వహణలో ఎటువంటి అవాంతరాలు ఏర్పడినా అధికారులను రక్షించడానికి పోలీసుల సహకారం తీసుకుంటున్నామని ఎన్నికల సంఘం కోర్టుకు వెల్లడించింది.

# మార్చి 14 నుంచి టెన్త్ పరీక్షలు

మొదటి పేజీ తరువాయి

వరకు సైన్స్ పేపర్ 1, పేపర్ 2 ఎగ్జామ్స్ నిర్వహించనున్నారు. ప్రతి ఎగ్జామ్ కి దాదాపు నాలుగు రోజుల గ్యాప్ రావడంతో విద్యార్థులకు పండగల ఒత్తిడి ఉండదని అధికారులు చెబుతున్నారు. ఫెస్టివల్ టైమ్ లో ఎక్కువ గ్యాప్ రావడంతో ప్రిపేర్ అవడానికి విద్యార్థులకు సమయం దొరుకుతుందని విద్యాశాఖ అధికారులు భావిస్తున్నారు. ఈ మేరకు ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదనలకు గ్రీన్ సిగ్నల్ రావడంతో అధికారికంగా పరీక్షల షెడ్యుల్ విడుదల చేశారు. ఈ మేరకు అన్ని జిల్లాల డీఈవోలకు, స్కూల్ హెడ్ మాస్టర్ లకి విద్యా శాఖ సమాచారం పంపింది. పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకొని జిల్లా విద్యా అధికారులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

### పరీక్షల టైం టేబుల్ ఇదే..



- 14 మార్చి 2026 – ఫస్ట్ లాంగ్వేజ్
- 18 మార్చి 2026 – సెకండ్ లాంగ్వేజ్
- 23 మార్చి 2026 – థర్డ్ లాంగ్వేజ్
- 28 మార్చి 2026 – మ్యాథమెటిక్స్
- 02 ఏప్రిల్ 2026 – ఫిజికల్ సైన్స్
- 07 ఏప్రిల్ 2026 – బయోలాజికల్ సైన్స్
- 13 ఏప్రిల్ 2026 – సోషల్ స్టడీస్

# 12న తాండవమే!

## అఖండ2 విడుదలకు మార్గం సుగమం



హైదరాబాద్, డిసెంబర్ 9 (ఈవార్తలు): అఖండ 2 విడుదలకు మార్గం సుగమమైంది. సినిమా విడుదలను డిసెంబర్ 12కు లాక్ చేస్తూ నిర్మాతలు అధికారిక ప్రకటన చేశారు. జరిగిన పరిణామాలకు సారీ చెప్పి డబుల్ బ్లాక్ బస్టర్ ఖాయమనే హామీ ఇచ్చారు. డిసెంబర్ 11 రాత్రి స్పెషల్ ప్రీమియర్లు వేయబోతున్నారు. ఇక ఇప్పుడు ఎలాంటి మార్పు ఉండబోవని, చెప్పిన టైంకే షోలు మొదలైపోతాయని స్పష్టం చేశారు. ఈ మేరకు ఓ కొత్త పోస్టర్‌ను విడుదల చేస్తూ, ఒకరోజు ముందుగా అంటే డిసెంబర్ 11న గ్రాండ్ ప్రీమియర్లు ఉంటాయని వెల్లడించింది. దర్శకుడు బోయపాటి శ్రీను, బాలకృష్ణ కాంబినేషన్‌లో వస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి. వాస్తవానికి ఈ పాన్ ఇండియా చిత్రాన్ని డిసెంబర్ 5నే విడుదల చేయాల్సి ఉంది. అయితే, చివరి నిమిషంలో తలెత్తిన కొన్ని ఫైనాన్స్ సమస్యల కారణంగా విడుదల వాయిదా పడింది. దీంతో అభిమానులు తీవ్ర నిరాశకు గురయ్యారు. తాజాగా ఆ సమస్యలన్నింటినీ పరిష్కరించుకోవడంతో, చిత్ర విడుదలకు గ్రీన్ సిగ్నల్ పడింది. త్వరలోనే టికెట్ బుకింగ్స్ ప్రారంభిస్తామని చిత్ర యూనిట్ తెలిపింది. దీంతో బాక్సాఫీస్ వద్ద 'దైవిక విధ్వంసం' చూడటానికి అభిమానులు సిద్ధమవుతున్నారు.

# 1.5 లక్షల కోట్లు

మొదటి పేజీ తరువాయి

అవకాశాలపై ప్రధాని మోదీతో స్ఫూర్తిదాయకమైన చర్చ జరిగింది. దేశ ఆశయాలకు మద్దతుగా ఈ పెట్టుబడి పెడుతున్నాం" అని పేర్కొన్నారు. ఈ ప్రకటనపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. "ఏఐ విషయంలో ప్రపంచం భారత్ వైపు ఆశాభావంతో చూస్తోంది. సత్య నాదెళ్లతో ఫలవంతమైన చర్చ జరిగింది. ఆసియాలోనే అతిపెద్ద పెట్టుబడికి భారత్‌ను ఎంచుకోవడం సంతోషకరం" అని మోదీ తన పోస్ట్‌లో తెలిపారు. దేశ యువత ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుని, ఏఐ శక్తిని సృజనాత్మకంగా వినియోగించుకుంటుందన్న విశ్వాసాన్ని ప్రధాని వ్యక్తం చేశారు. ఇప్పటికే భారత్‌లో హైదరాబాద్, పుణే వంటి నగరాల్లో బలమైన కార్యకలాపాలు నిర్వహిస్తున్న మైక్రోసాఫ్ట్ తాజా పెట్టుబడి... దేశ డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు, స్టార్టప్‌లకు భారీ ఊతమిస్తుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# రష్యా రమ్మంది!

మొదటి పేజీ తరువాయి

పుతిన్ సంతకం చేసినట్లు అధికార వర్గాలు మీడియాకు వెల్లడించాయి. ఆ దేశ ప్రభుత్వం ఈ నిర్ణయం ద్వారా భారత్-రష్యా మొబిలిటీ ఒప్పందాన్ని బలోపేతం చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ కొత్త వీసా కార్యక్రమం వచ్చే ఏడాది ఏప్రిల్ 15 నుండి ప్రారంభమవుతుందని ఒక అధికారులు తెలిపారు. విదేశీ నిపుణులు, వారి కుటుంబసభ్యులు సైన్స్, ఆర్థిక, పారిశ్రామిక, విద్య, సాంస్కృతిక, వ్యాపార, క్రీడల వంటి రంగాలలో నైపుణ్యమున్న వారికి ఈ వీసాలు జారీ చేస్తారు. ఇమిగ్రేషన్ కోటాతో సంబంధం లేకపోయినా, రష్యా భాష పరీక్షలో ఉత్తీర్ణత సాధించకపోయినా, వారు మూడేళ్ల తాత్కాలిక నివాసం కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. వీసా ప్రక్రియ రెండు దశల్లో ఉంటుంది. మొదట అభ్యర్థులు సంబంధిత ఏజెన్సీల వద్ద దరఖాస్తు చేసుకోవాలి. తరువాత, వారు అర్హత కలిగినవారో లేదో గుర్తిస్తారు. అర్హులకు మూడేళ్లపాటు తాత్కాలిక లేదా శాశ్వత నివాసం కోసం దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పిస్తారు. ఏజెన్సీ ఆమోదం ఒక సంవత్సరం చెల్లుబాటు అవుతుంది. ఈ సమయంలో, విదేశీ అభ్యర్థులు తమ దరఖాస్తులను ఇమిగ్రేషన్ అధికారులకు సమర్పించాలి. విదేశీయులు స్వదేశంలో ఉన్నా, ఆన్‌లైన్ ద్వారా ఏజెన్సీలకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆమోదం పొందినవారికి, వారు, వారి కుటుంబసభ్యులు రష్యాకు వచ్చే బిజినెస్ వీసాను ఒక సంవత్సరానికి మంజూరు చేస్తారు. తాత్కాలిక, శాశ్వత నివాసం కోసం అభ్యర్థులు చేసుకున్న దరఖాస్తు పెండింగ్‌లో ఉంటే.. అలాంటి విదేశీయులకు, వారి కుటుంబసభ్యులకు వర్క్ పర్మిట్ పొందేందుకు అర్హులుగా గుర్తిస్తారు. ఇమిగ్రేషన్ అధికారులు వీరి దరఖాస్తులను 30 రోజుల్లో ప్రాసెస్ చేస్తారు.

# అమెరికా పొమ్మంది!

## భారతీయులే లక్ష్యంగా ట్రంప్ చర్యలు.. తాజాగా భారత్ బియ్యంపై టారిఫ్‌లు



వాషింగ్టన్: రెండోసారి అధికారం చేపట్టినప్పటి నుంచి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారతీయులపై కక్షగట్టినట్లు వ్యవహరిస్తున్నారు. హెచ్1 వీసా, భారత్‌పై టారిఫ్‌ల మోత తదితర కఠిన చర్యలకు దిగిన ట్రంప్.. తాజాగా, భారత్‌తో సహా పలు దేశాల నుంచి దిగుమతి అయ్యే బియ్యంపై అదనపు సుంకాలు విధింపునకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. భారత్ బియ్యంతో సహా వ్యవసాయ దిగుమతులపై సుంకాలు విధించేందుకు తన ప్రభుత్వం సిద్ధంగా ఉందని ట్రంప్ బెదిరించారు. భారత్ నుంచి సబ్సిడీతో దిగుమతి అవుతున్న బియ్యం అమెరికా మార్కెట్లను దెబ్బతీస్తోందని, ఫలితంగా దేశంలో ధరలు పడిపోతున్నాయని, దీనిపై కఠిన చర్యలు తీసుకోవాలని అమెరికా రైతులు కోరుతున్నారని ట్రంప్ చెప్పారు. ఈ మేరకు మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమెరికా మార్కెట్లను దెబ్బతీస్తున్న దేశాలను గుర్తించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. కెనడా నుంచి దిగుమతి అవుతున్న ఎరువులపై కూడా సుంకాలు విధిస్తామని తెలిపారు. అమెరికా ఉత్పత్తులను పెంచేందుకు భారీగా సుంకాలను విధించే విషయాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు. భారత్, థాయిలాండ్, చైనా వంటి దేశాలు పెద్దయెత్తున మోసానికి పాల్పడుతున్నాయని లూసియానాలోని కెన్నడీ రైస్ మిల్లు సిఇఒ మెర్లీ కెన్నడీ.. దేశాధ్యక్షుడికి ఫిర్యాదు చేశారు. దీంతో ఏయే దేశాల నుంచి చౌకగా సరుకులు డంపింగ్ అవుతున్నాయో పరిశీలించాలని ఆర్థిక మంత్రి స్కాట్ బెస్సెంట్‌ను ట్రంప్ కోరారు.







# ఆహా.. సమ్మిట్ అద్భుతం

## సీఎం రేవంత్‌పై అంబటి రాయుడు ప్రశంసలు

హైదరాబాద్, డిసెంబర్ 9 (ఈవార్తలు): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025'పై ప్రముఖ క్రికెటర్ అంబటి రాయుడు, బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు స్పందించారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ సదస్సు ద్వారా తెలంగాణ రాష్ట్రానికి లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయి. ఈ నేపథ్యంలో అంబటి రాయుడు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అద్భుతమైన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని అన్నాడు. రాష్ట్రంలో క్రీడల కోసం ప్రపంచస్థాయి సదుపాయాలను కల్పించడానికి ఈ సదస్సు ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశాడు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ క్రీడా రంగ అభివృద్ధికి ఎంతగానో తోడ్పడుతుందని బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు పేర్కొంది. రాష్ట్రంలో అత్యాధునిక స్టేడియాలు, శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా కొత్త క్రీడాకారులు రాష్ట్రానికి ప్రాతినిథ్యం వహించి, తెలంగాణ రాష్ట్రం, భారతదేశ ఘనతను ప్రపంచానికి చాటి చెబుతారని ఆశాభావం వ్యక్తం చేసింది.

## ఇందిరమ్మ చీరలో కొండా సురేఖ

హైదరాబాద్, డిసెంబర్ 9 (ఈవార్తలు): 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025'కు తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఇందిరమ్మ చీరలో విచ్చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అందించిన ఇందిరమ్మ చీరను ధరించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గత ప్రభుత్వం బతుకమ్మ చీరల పేరుతో నాణ్యత లేని చీరలను పంపిణీ చేసిందని ఆరోపించారు. వాటిని మహిళలు ధరించడానికి వీలులేని విధంగా ఉన్నాయని అన్నారు. తమ ప్రభుత్వం నాణ్యతతో కూడిన చీరలను అందించిందని, అందుకే మంత్రులు, మంత్రుల భార్యలు ఇందిరమ్మ చీరలు ధరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారని తెలిపారు. సోనియా గాంధీ పుట్టినరోజును పురస్కరించుకుని తాను గ్లోబల్ సమ్మిట్‌కు ఈ చీరను ధరించి వచ్చానని అన్నారు. తమది ఇందిరమ్మ పాలన అని కొండా సురేఖ స్పష్టం చేశారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌ను గోబెల్ సమ్మిట్ అంటూ విమర్శలు చేస్తున్న బీఆర్ఎస్‌పై మంత్రి కొండా సురేఖ ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లలో బీఆర్ఎస్ చేయలేని అభివృద్ధిని తమ ప్రభుత్వం చేస్తుంటే జీర్ణించుకోలేక బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ సదస్సు ద్వారా లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వస్తున్నాయని, ఈ పెట్టుబడులను రేవంత్ రెడ్డి ఇంట్లోనే, మంత్రుల ఇళ్లలోనో దాచుకోబోమని అన్నారు. పరిశ్రమలు వస్తే యువతకు ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు.

## తెలంగాణను ఆంధ్రోళ్ల చేతిలో పెట్టే కుట్ర

### మాజీమంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 9 (ఈవార్తలు): కేసీఆర్ దీక్ష ఫలితంగా వచ్చిన డిసెంబర్ 9 ప్రకటన తెలంగాణ ఉద్యమాన్ని చారిత్రక మలుపు తిప్పిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. ఈ కీలకమైన రోజున ఆయన అధికార కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. కేసీఆర్ కష్టపడి సాధించుకున్న తెలంగాణ నేడు దోపిడీ దొంగల పాలైందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను అమ్మే పనిలో నిమగ్నమయ్యారని ప్రశాంత్ రెడ్డి విమర్శించారు. కేసీఆర్ అభివృద్ధి చేసిన తెలంగాణను మళ్లీ ఆంధ్ర నాయకుల చేతుల్లో పెట్టేందుకు కుట్ర జరుగుతోందని, ప్రజలు ఈ కుట్రలను గమనించి కాంగ్రెస్ పాలనకు చరమగీతం పాడాలని ఆయన పిలుపునిచ్చారు. నిజామాబాద్ జిల్లా భీమగల్ పట్టణంలో జరిగిన 'విజయ్ దివస్' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్, తెలంగాణ తల్లి విగ్రహాలకు నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. కేసీఆర్ నాయకత్వంలో అనేక పోరాటాల తర్వాత తెలంగాణ సాకారమైందని, ఆయన పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని గుర్తుచేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై విరుచుకుపడుతూ.. "కేసీఆర్ కడుపులో పెట్టుకుని కాపాడుకున్న తెలంగాణను 'ఈన కాచి నక్కల పాలు' చేసినట్లుగా దోపిడీ దొంగలకు అప్పగించారు. రాష్ట్రంలో రాక్షసుల, రాబందుల పాలన కొనసాగుతోంది" అని మండిపడ్డారు. సాధ్యం కాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు.

## అస్తిత్వం కోసం మరో పోరాటం

### కేసీఆర్ ఎప్పుడు రావాలో అప్పుడొస్తారు

### కేసీఆర్ దీక్ష వల్లే తెలంగాణ సాధ్యమైంది: హరీశ్

హైదరాబాద్, డిసెంబర్ 9 (ఈవార్తలు): తెలంగాణ అస్తిత్వ పరిరక్షణ కోసం ప్రజలు మరో పోరాటానికి సిద్ధం కావాల్సిన సమయం వచ్చిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు పిలుపునిచ్చారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన 'విజయ దీక్షా దివస్' కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. గత రెండేళ్లుగా రేవంత్ రెడ్డి తెలంగాణ అస్తిత్వాన్ని దెబ్బతీస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. "తెలంగాణ ఉద్యమ ద్రోహుల చరిత్ర రాస్తే, అందులో రేవంత్ రెడ్డి పేరే రాయాల్సి వస్తుంది. రేవంత్ రెడ్డి అంటే ద్రోహి, వెన్నుపోటు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చే హక్కు ఆయనకు లేదు" అని మండిపడ్డారు. కాళోజీ, దాశరథి, గద్దర్ అవార్డులను కాదని, రామోజీరావు కంటే గొప్ప అవార్డు లేదని రేవంత్ మాట్లాడటం రాష్ట్ర పురస్కారాలను అవమానించడమేనని అన్నారు. కేసీఆర్ త్యాగం వల్లే తెలంగాణ రాష్ట్రం సాకారమైందని హరీశ్‌రావు గుర్తుచేశారు. "కేసీఆర్ దీక్ష చేయకపోతే తెలంగాణ ప్రకటన వచ్చేది కాదు. పదవులను గడ్డిపోచలా వదిలేసిన వ్యక్తి కేసీఆర్. నిమ్స్‌లో ప్రాణాల మీదకు వచ్చినా దీక్ష విరమించలేదు. అలాంటి కేసీఆర్‌ను ప్రజల ఆశీర్వాదం కాపాడుతోంది. ఆయన ఆరోగ్యం బాగుంది. ఆయన ఎప్పుడు రావాలో అప్పుడే వస్తారు" అని తెలిపారు. ప్రజలకు పాలకుల మధ్య తేడా ఇప్పటికే అర్థమైందని, కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ప్రజలు ఎదురుచూస్తున్నారని హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్ నాయకులు తెలంగాణ ఉద్యమ చరిత్రను వక్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.

## స్కూళ్లకు 6 రోజులు సెలవు

హైదరాబాద్, డిసెంబర్ 9 (ఈవార్తలు): రాష్ట్రంలో జరుగుతున్న పంచాయతీ ఎన్నికల కారణంగా పాఠశాలలకు వరుస సెలవులు లభించనున్నాయి. ఎన్నికల పోలింగ్ కేంద్రాలను పాఠశాలల్లో ఏర్పాటు చేస్తుండటంతో, ప్రభుత్వం పలు దఫాలుగా సెలవులు ప్రకటించింది. దీంతో ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలోని విద్యార్థులు, ఉపాధ్యాయులకు సుమారు ఆరు రోజుల పాటు విరామం దొరకనుంది. తొలి విడత పోలింగ్ నిర్వహణ, ఏర్పాట్ల కోసం డిసెంబర్ 10, 11 తేదీల్లో పాఠశాలలకు సెలవులు ఇస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ఆయా జిల్లాల కలెక్టర్లు ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. ఇక రెండో విడత ఎన్నికల పోలింగ్ డిసెంబర్ 13, 14 తేదీల్లో జరగనుండగా, ఆ రోజులు రెండో శనివారం, ఆదివారం కావడంతో అవి సాధారణ సెలవులుగా కలిసివచ్చాయి. అనంతరం మూడో విడత పోలింగ్ సందర్భంగా డిసెంబర్ 16, 17 తేదీల్లో కూడా పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. పోలింగ్ సామగ్రిని సిద్ధం చేయడం, ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించడం కోసం ఈ నిర్ణయం తీసుకున్నారు. మరోవైపు, పోలింగ్ జరిగే ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులతో పాటు కార్మికులకు సైతం వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.



## మూడేళ్లలో అపోలో 1700 కోట్ల పెట్టుబడి

### సీఎస్ఆర్ వైస్ చైర్‌పర్సన్ ఉపాసన కీలక ప్రకటన

హైదరాబాద్, డిసెంబర్ 9 (ఈవార్తలు): తెలంగాణలో ఆరోగ్య సంరక్షణ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు అపోలో గ్రూప్ ముందుకొచ్చింది. రాష్ట్రంలో రాబోయే మూడేళ్లలో రూ.1700 కోట్ల భారీ పెట్టుబడి పెట్టనున్నట్లు ఆ సంస్థ సీఎస్ఆర్ వైస్ ఛైర్‌పర్సన్ ఉపాసన కొణిదెల ప్రకటించారు. ఈ పెట్టుబడి ద్వారా 24 వేలకు పైగా ఉద్యోగాలను సృష్టించనున్నట్లు ఆమె వెల్లడించారు. ఈ మేరకు ఉపాసన తన సోషల్ మీడియా ఖాతాలో ఓ వీడియోను పోస్ట్ చేశారు. తెలంగాణలో ఆరోగ్య సంరక్షణకు తమ అపోలో కుటుంబం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ముఖ్యంగా మహిళలు, యువత సాధికారతే లక్ష్యంగా ఈ ఉద్యోగాల కల్పన ఉంటుందని ఆమె వివరించారు. తమ గ్రూప్‌కు చెందిన వెయ్యికి పైగా ఫార్మసీల ద్వారా ఇప్పటికే ఏటా 2,62,749 కుటుంబాలకు అండగా నిలుస్తున్నామని ఉపాసన తెలిపారు. ఈ కొత్త పెట్టుబడులతో రాష్ట్రంలో ఆరోగ్య సేవలను మరింత విస్తృతం చేయాలనేది తమ లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. తాజా పెట్టుబడి ప్రకటనతో తెలంగాణ ఆరోగ్య రంగంలో మరిన్ని అవకాశాలు మెరుగుపడనున్నాయి.



## వేల ఉద్యోగాలిచ్చేలా ఫ్యూచర్ సిటీ

### మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడి

హైదరాబాద్, డిసెంబర్ 9 (ఈవార్తలు): హైదరాబాద్ నగరానికి నాల్గవ న్యూక్లియస్ (కేంద్రకం)గా ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తామని తెలంగాణ రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో ఆయన మాట్లాడుతూ, భారీగా ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా ఫ్యూచర్ సిటీని తీర్చిదిద్దుతామని అన్నారు. దీనిని నెట్ జీరో కార్బన్ సిటీగా అభివృద్ధి చేస్తామని ఆయన తెలిపారు. సుమారు 13,500 ఎకరాల్లో గ్రీన్ సిటీగా దీనిని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఫ్యూచర్ సిటీకి మెట్రో రైలు అనుసంధానిస్తామని అన్నారు. జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులకు అనుగుణంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. జోన్ల వారీగా విభజించి, ప్రతి జోన్‌ను ప్రత్యేకంగా తీర్చిదిద్దుతామని ఆయన అన్నారు. ఫ్యూచర్ సిటీలో ఏఐ సిటీ, హెల్త్ సిటీ, ఎంటర్‌టైన్‌మెంట్ డిస్ట్రిక్, స్పోర్ట్స్ హబ్, ఎడ్యుకేషన్ జోన్, ఎకో టూరిజం హబ్ ఉంటాయని మంత్రి వెల్లడించారు. ఫ్యూచర్ సిటీలో విశ్వవిద్యాలయాల ఏర్పాటుకు పలు సంస్థలు ఆసక్తి చూపుతున్నాయని ఆయన అన్నారు. త్వరలో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ప్రారంభిస్తామని తెలిపారు. దాదాపు 400 ఎకరాల్లో డేటా సెంటర్ సిటీ నిర్మాణం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.



# వస్తోంది కృత్రిమ బీచ్

### టన్నెల్ అక్వేరియం కూడా

### భారీ పెట్టుబడులతో ఒప్పందాలు

హైదరాబాద్, డిసెంబర్ 9 (ఈవార్తలు): హైదరాబాద్ నగర పర్యాటకానికి సరికొత్త కళ రానుంది. నగరవాసులకు సముద్ర తీర అనుభూతిని అందించేందుకు కృత్రిమ బీచ్‌తో పాటు, దుబాయ్, సింగపూర్ తరహాలో టన్నెల్ అక్వేరియం, ఫ్లయింగ్ థియేటర్ వంటి భారీ ప్రాజెక్టులు అందుబాటులోకి రానున్నాయి. ఈ ప్రాజెక్టుల ఏర్పాటు కోసం పలు సంస్థలు మంగళవారం ప్రభుత్వంతో అవగాహన ఒప్పందాలు (ఎంవోయూ) కుదుర్చుకున్నాయి. ప్రాజెక్టు భాగస్వామి హరి దామెర వెల్లడించిన వివరాల ప్రకారం కొత్వాల్‌గూడలో 35 ఎకరాల విస్తీర్ణంలో రూ.235 కోట్ల వ్యయంతో ఈ కృత్రిమ బీచ్‌ను ఏర్పాటు చేయనున్నారు. స్పెయిన్ సాంకేతిక సహకారంతో నిర్మించే ఈ బీచ్‌లో సాధారణ ప్రజలు సేద తీరడంతో పాటు బోటింగ్ వంటివి కూడా ఆస్వాదించవచ్చు. డెస్టినేషన్ వెడ్డింగ్‌లకు కూడా ఇది కేంద్రంగా నిలుస్తుంది. ప్రవేశ రుసుము సుమారు రూ.200 వరకు ఉండవచ్చని తెలిపారు. ఇక దుబాయ్, సింగపూర్‌లలో ఉన్న తరహాలోనే నీటి అడుగున నడుస్తూ జలచరాలను వీక్షించే అనుభూతినిచ్చేలా టన్నెల్ అక్వేరియం రానుంది. కెడార్ అనే సంస్థ రూ.300 కోట్లతో దీనిని నిర్మించనుంది. దీంతో పాటు, ఫ్యూచర్ సిటీలో వంద ఎకరాల్లో వెయ్యి కోట్ల పెట్టుబడితో అంతర్జాతీయ సాంస్కృతిక కేంద్రం కూడా ఏర్పాటు కానుంది. వీటితో పాటు హైదరాబాద్ సమీపంలోని వికారాబాద్‌లో పర్యాటకుల కోసం ప్రత్యేకంగా క్యారవాన్ పార్కును ఏర్పాటు చేయనున్నారు. వాహనాలకు పార్కింగ్, చార్జింగ్, బస, ఆహార సదుపాయాలు ఇక్కడ ఉంటాయి. మరోవైపు, ఫ్యూచర్ సిటీలో ప్రత్యేక అనుభూతినిచ్చే ఫ్లయింగ్ థియేటర్‌ను కూడా నిర్మించనున్నారు. పర్యాటక రంగంలో ఉపాధి అవకాశాలు పెంచేందుకు 'స్కూల్ ఆఫ్ టూరిజం ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ ప్రాజెక్ట్స్ (స్టెప్)'ను కూడా ప్రారంభించనున్నారు.

## చైర్మన్ పదవిని తిరస్కరించలేకపోయా

### స్కిల్ వర్సిటీకి చైర్మన్‌గా ఉండాలని చెప్పా

### రేవంత్ విజన్ విన్నాక విజ్ఞప్తిని ఓకే చేశా

### మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా



హైదరాబాద్, డిసెంబర్ 9 (ఈవార్తలు): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యాలు, విజన్‌ను విన్న తర్వాత స్కిల్ యూనివర్సిటీకి ఛైర్మన్‌గా ఉండాలనే ఆయన విజ్ఞప్తిని తిరస్కరించలేకపోయానని మహీంద్రా గ్రూప్ ఛైర్మన్ ఆనంద్ మహీంద్రా అన్నారు. 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025'లో అన్ని సెషన్లు ముగిశాయి. ఈ సందర్భంగా తెలంగాణ రైజింగ్ విజన్-2047 డాక్యుమెంట్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మహీంద్రా గ్రూప్ ఛైర్మన్ ఆనంద్ మహీంద్రా, సినీ నటుడు చిరంజీవి, ఆర్బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆనంద్ మహీంద్రా మాట్లాడుతూ, దీర్ఘకాలిక లక్ష్యాలతో డాక్యుమెంట్‌ను రూపొందించారని ప్రశంసించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దార్శనికతకు ఆయన అభినందనలు తెలిపారు. స్కిల్ యూనివర్సిటీకి ఛైర్మన్‌గా ఉండాలని ముఖ్యమంత్రి తనను అడిగారని గుర్తు చేసుకున్నారు. అప్పటికే టెక్ మహీంద్రా యూనివర్సిటీకి ఛైర్మన్‌గా ఉన్నందున కుదరదని చెప్పానని, కానీ ఆయన విజన్ విన్నాక అంగీకరించినట్లు తెలిపారు. తెలంగాణ రైజింగ్ విజన్ బ్లూప్రింట్ చూశానని, ప్రజలనే కేంద్రంగా చేసుకుని దీనిని రూపొందించారని ఆయన ప్రశంసించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆర్బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం గొప్ప అభివృద్ధి సాధిస్తోందని అన్నారు. దేశంలోనే వృద్ధి రేటు ఎక్కువగా ఉన్న రాష్ట్రంగా నిలిచిందని అన్నారు. హైదరాబాద్ ఐకానిక్ నగరంగా నిలిచిందని పేర్కొన్నారు. ప్రపంచస్థాయి కంపెనీలకు ఇప్పుడు గమ్యస్థానంగా ఉందని, నీతి ఆయోగ్ లక్ష్యాలకు అనుగుణంగా తెలంగాణ విజన్ డాక్యుమెంట్ ఉందని అన్నారు. దేశంలోనే వృద్ధి రేటు ఎక్కువగా ఉన్న రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని సుబ్బారావు వెల్లడించారు. ప్రతి సంవత్సరం 8-9 శాతం వృద్ధి సాధిస్తే తెలంగాణ తన లక్ష్యాలను అందుకోగలదని అన్నారు. చైనా గ్వాంగ్‌డాంగ్ నమూనాను తెలంగాణ ప్రభుత్వం ఎంచుకుందని గుర్తు చేశారు.



## చిరు, జెనీలియాతో రేవంత్ భేటీ

### సినీ ప్రముఖులతో సమావేశం

హైదరాబాద్, డిసెంబర్ 9 (ఈవార్తలు): తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025లో భాగంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సినీ ప్రముఖులతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో సినీ ప్రముఖులు చిరంజీవి, జెనీలియా, అమల, ప్రముఖ నిర్మాతలు అల్లు అరవింద్, సురేశ్ బాబు, దిల్ రాజు, పలువురు తెలుగు, హిందీ ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సెషన్‌లో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, ఫ్యూచర్ సిటీలో స్టూడియోలను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని రకాల సహాయ సహకారాలు ఉంటాయని హామీ ఇచ్చారు. స్క్రిప్ట్‌తో వచ్చి సినిమాలు పూర్తి చేసుకొని వెళ్లండి అని వారికి సూచించారు. ఫ్యూచర్ సిటీలో స్టూడియోల ఏర్పాటుకు సహకారం ఉంటుందని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్రంలో సినిమా ఇండస్ట్రీ అభివృద్ధికి కావాల్సిన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. ఫ్యూచర్ సిటీలో స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తామని ఆయన అన్నారు. 24 క్రాఫ్ట్స్‌లో సినిమా పరిశ్రమ అవకాశాలకు అనుగుణంగా స్థానికులకు శిక్షణ ఇచ్చే అంశాన్ని కూడా పరిశీలించాలని సినీ ప్రముఖులకు ముఖ్యమంత్రి సూచించారు. కాగా, అంతకుముందు సినీ నటుడు చిరంజీవి ఆయనను కలిశారు.



## సీపీఆర్‌తో ప్రాణాలు కాపాడిన ఏఆర్ కానిస్టేబుళ్లు

వేములవాడ, డిసెంబర్ 9 (ఈవార్తలు):సరైన సమయంలో సీపీఆర్ చేసి ఓ నిండు ప్రాణాన్ని కాపాడారు ఇద్దరు ఏఆర్ కానిస్టేబుళ్లు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని తిప్పాపూర్ బస్టాండ్ వద్ద రమేశ్ (49) అనే వ్యక్తి గుండె పోటుతో కుప్పకూలాడు. అక్కడే విధులు నిర్వర్తిస్తున్న ఏఆర్ కానిస్టేబుళ్లు గంగరాజు, శ్రీనివాస్.. వెంటనే స్పందించి సీపీఆర్ చేశారు. దీంతో రమేశ్ ప్రాణాలతో బయటపడ్డాడు. అనంతరం అతడిని వేములవాడ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. తక్షణం స్పందించి నిండు ప్రాణాన్ని కాపాడిన ఏఆర్ కానిస్టేబుళ్లను జిల్లా ఎస్పీ మహేశ్ బీ గీతే అభినందించారు.



## 1.30 లక్షల అక్రమ మద్యం పట్టివేత

బోయినపల్లి, డిసెంబర్ 9 (ఈవార్తలు): అక్రమంగా తరలిస్తున్న రూ.1,33,000 విలువైన మద్యాన్ని రాజన్న సిరిసిల్ల జిల్లా బోయిన్‌పల్లి టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. కారు సీజ్ చేసి, ఇద్దరిపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా బోయినపల్లి ఎస్సై రమాకాంత్ మాట్లాడుతూ.. స్తంభంపల్లికిచెందిన సంతోష్, సుమన్ వేములవాడ పట్టణంలోని వైన్స్‌లో మద్యం కొని తరలిస్తున్నారన్న సమాచారంతో తనిఖీలు చేపట్టగా మద్యం పట్టుబడిందని తెలిపారు. మొత్తం 253 లీటర్ల మద్యం లభించిందని వెల్లడించారు. పంచాయతీ ఎన్నికలవేళ అక్రమ మద్యం, డబ్బు రవాణాకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## అప్పర్ కృష్ణాకు ఏపీ, మహారాష్ట్ర అడ్డంకులు

**కర్ణాటక డిప్యూటీసీఎం డీకే ఆరోపణలు**

బెంగళూరు: కర్ణాటకలోని కీలకమైన అప్పర్ కృష్ణా ప్రాజెక్టు (యూకేపీ) ఫేజ్-3 అమలుకు మొదట మహారాష్ట్ర, ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు అడ్డుపడ్డాయని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆరోపించారు. 2013 నుంచి కేంద్ర ప్రభుత్వం కూడా ఈ ప్రాజెక్టుకు అవసరమైన నోటిఫికేషన్ జారీ చేయలేదని ఆయన తెలిపారు. మంగళవారం రాష్ట్ర అసెంబ్లీలో నీటిపారుదల ప్రాజెక్టులపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు జలవనరుల శాఖ మంత్రిగా కూడా ఉన్న శివకుమార్ సమాధానమిచ్చారు. ప్రాజెక్టు కోసం భూ పరిహారంపై తమ ప్రభుత్వం చారిత్రక నిర్ణయం తీసుకుందని శివకుమార్ వెల్లడించారు. "ఈ ప్రాజెక్టును పూర్తి చేయడానికి మేము కట్టుబడి ఉన్నాం. దీనికోసం నిధులు కేటాయిస్తాం. ఏటా రూ.15,000 నుంచి రూ.20,000 కోట్లు కేటాయించి, రాబోయే మూడు, నాలుగేళ్లలో భూసేకరణ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం," అని ఆయన వివరించారు. కొన్ని చోట్ల ఇప్పటికే పనులు ప్రారంభించామని తెలిపారు. అయితే, భూ పరిహారం అంశం ఒక పెద్ద మాఫియాలా తయారైందని డీకే శివకుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. "రూ.10 లక్షల విలువైన భూమికి రూ.10 కోట్ల పరిహారం ఇస్తున్నారు. ఇందులో లాయర్లు, అధికారులు కుమ్మక్కయ్యారు. అంత పెద్ద మొత్తంలో పరిహారం చెల్లించడం సాధ్యం కాదు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటానికే మేము కట్టుబడి ఉన్నాం," అని ఆయన స్పష్టం చేశారు. ఇదే సమయంలో, ఘటప్రభ కాలువ అభివృద్ధి కోసం రూ.1,722 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి కేంద్రానికి పంపామని, కేంద్రం 60%, రాష్ట్రం 40% వాటాతో ఈ పనులు చేపడతామని చెప్పారు. కాలువల వెంట అక్రమ పంప్ సెట్లను నియంత్రించడానికి కొత్త చట్టం తెచ్చామని, నీరు చివరి ఆయకట్టు వరకు చేరేలా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు.

## ఏపీలో లారీ ఓనర్ల సమ్మె తాత్కాలిక వాయిదా

విజయవాడ, డిసెంబర్ 9 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో మంగళవారం అర్ధరాత్రి నుంచి జరగాల్సిన లారీల సమ్మె తాత్కాలికంగా వాయిదా పడింది. లారీ యజమానుల సంఘం ప్రతినిధులతో రాష్ట్ర ప్రభుత్వం జరిపిన చర్చలు ఫలప్రదం కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. విజయవాడలోని రవాణా శాఖ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ఇరు వర్గాల మధ్య సానుకూల వాతావరణంలో చర్చలు జరిగాయి. లారీల ఫిట్‌నెస్ చార్జీలను ప్రభుత్వం పెంచడాన్ని నిరసిస్తూ లారీ ఓనర్ల సంఘం సమ్మెకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. సమ్మెలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని రవాణా వాహనాలను ఈ అర్ధరాత్రి నుంచి నిలిపివేస్తామని హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ప్రజలకు రవాణా పరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నివారించేందుకు కూటమి ప్రభుత్వం వెంటనే రంగంలోకి దిగింది. లారీ ఓనర్ల అసోసియేషన్ నేతలను చర్చలకు ఆహ్వానించి, వారి సమస్యలను అడిగి తెలుసుకుంది. ప్రభుత్వ సానుకూల స్పందనతో లారీ యజమానుల సంఘం తమ సమ్మెను తాత్కాలికంగా విరమించుకుంది. దీంతో రాష్ట్రంలో రవాణా సేవలకు ఎదురవబోయే పెద్ద ఆటంకం తప్పినట్లయింది.

# స్క్రబ్ టైఫస్‌పై ప్రత్యేక టాస్క్‌ఫోర్స్

**కట్టడికి ఏపీ సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు**

అమరావతి, డిసెంబర్ 9 (ఈవార్తలు): ఏపీలో ఆందోళన కలిగిస్తున్న స్క్రబ్ టైఫస్ వ్యాధి నియంత్రణకు, దానిపై సమగ్ర అధ్యయనం చేసేందుకు జాతీయ స్థాయి వైద్య నిపుణులతో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. అపరిశుభ్రతే అనేక వ్యాధులకు మూలకారణమని, ప్రజల్లో పరిశుభ్రతపై విస్తృత చైతన్యం తీసుకురావడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం సచివాలయంలో వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పలు కీలక సూచనలు చేశారు. రాష్ట్రంలో స్క్రబ్ టైఫస్ వ్యాధి తీవ్రతపై అధికారులు ముఖ్యమంత్రికి వివరాలు అందించారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 1,592 స్క్రబ్ టైఫస్ కేసులు నమోదయ్యాయని, అత్యధికంగా చిత్తూరు జిల్లాలో 420 కేసులు ఉన్నాయని తెలిపారు. అయితే, ఈ వ్యాధి కారణంగానే మరణాలు సంభవించినట్లు ఇప్పటివరకు ఎక్కడా నిర్ధారణ కాలేదని అధికారులు స్పష్టం చేశారు. అనుమానిత మరణాలుగా నమోదైన 9 కేసులను పరిశీలించగా, ఇతర ఆరోగ్య సమస్యలు, మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్ కారణంగానే వారు మరణించినట్లు తేలిందని వివరించారు. స్క్రబ్ టైఫస్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నామని, ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య బృందాలతో పరీక్షలు చేస్తున్నామని తెలిపారు. దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే కేసుల



సంఖ్యలో ఆంధ్రప్రదేశ్ 8వ స్థానంలో ఉందని, తమిళనాడు, ఒడిశాలలో ఏకంగా 7 వేలకు పైగా కేసులు ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు. ఈ నివేదికపై స్పందించిన ముఖ్యమంత్రి, స్క్రబ్ టైఫస్‌ను తేలికగా తీసుకోవద్దని హెచ్చరించారు. తక్షణమే జాతీయ, అంతర్జాతీయ నిపుణులతో ఒక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ బృందం క్షేత్రస్థాయిలో పర్యటించి, వ్యాధి వ్యాప్తికి గల కారణాలను విశ్లేషించి, నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని సూచించారు. ఆ నివేదిక ఆధారంగా పటిష్ఠమైన కార్యాచరణ అమలు చేయాలని దిశానిర్దేశం చేశారు.

**సీజనల్ వ్యాధులు 48 శాతం తగ్గుముఖం**

గత ఏడాదితో పోలిస్తే రాష్ట్రంలో సీజనల్ వ్యాధులు గణనీయంగా తగ్గుముఖం పట్టాయని అధికారులు సమావేశంలో వెల్లడించారు. ప్రభుత్వం చేపట్టిన ముందస్తు జాగ్రత్త చర్యలు, పారిశుద్ధ్య కార్యక్రమాలు, ప్రజల్లో అవగాహన పెంచడం వంటి కారణాలతో మొత్తం సీజనల్ వ్యాధులు 48 శాతం తగ్గాయని తెలిపారు. ముఖ్యంగా డెంగ్యూ కేసులు 56 శాతం, చికున్‌గున్యా 46.5 శాతం, మలేరియా 11 శాతం మేర తగ్గాయని వివరించారు. పరిశుభ్రతను పెంచడం ద్వారా సీజనల్ వ్యాధులను సున్నా స్థాయికి తీసుకురావాలని సీఎం చంద్రబాబు లక్ష్యంగా నిర్దేశించారు. సమాజంలో అతిపెద్ద జబ్బు అపరిశుభ్రతేనని, దానిపై యుద్ధం ప్రకటించాలని పిలుపునిచ్చారు. ఈ సమీక్షా సమావేశంలో వైద్యారోగ్య శాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్, కమిషనర్ వీరపాండ్యన్, ఎన్టీఆర్ వైద్యసేవ సీఈవో దినేష్ కుమార్, ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ గిరీశా తదితరులు పాల్గొన్నారు.

# వాజ్‌పేయికి రాజకీయ శత్రువులే లేరు

విజయవాడ,డిసెంబర్ 9 (ఈవార్తలు): మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతి ఉత్సవాల సందర్భంగా రాష్ట్రంలో నిర్వహించనున్న 'అటల్ సందేశ్-మోదీ సుపరిపాలన' యాత్రను విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్డీయే కూటమి నేతలకు పిలుపునిచ్చారు. డిసెంబర్ 11 నుంచి 25వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా జరగనున్న ఈ యాత్రలో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలకు చెందిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర నాయకులు చురుగ్గా పాల్గొనాలని ఆయన కోరారు. మంగళవారం ఆయన ఎన్డీయే ప్రజాప్రతినిధులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, యాత్రకు సంబంధించిన పలు సూచనలు చేశారు. వాజ్‌పేయి అందించిన సుపరిపాలన సందేశాన్ని ప్రజల్లోకి, ముఖ్యంగా యువతలోకి బలంగా తీసుకెళ్లేందుకు ఈ యాత్రను నిర్వహిస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గాన్ని చంద్రబాబు అభినందించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. వాజ్‌పేయిని 'రాజకీయ భీష్ముడు'గా అభివర్ణించారు. ఆయన శత జయంతి వేడుకల నేపథ్యంలో ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం ఎంతో సంతోషకరమైన విషయమన్నారు. దేశంలో సుపరిపాలనకు వాజ్‌పేయి బలమైన పునాదులు వేశారని, ఆయన అమలు చేసిన విధానాలే దేశాభివృద్ధికి బీజాలు వేశాయని కొనియాడారు. "వాజ్‌పేయికి



రాజకీయంగా శత్రువులు లేరు. ప్రతి భారతీయుడు గర్వపడే నాయకత్వాన్ని ఆయన దేశానికి అందించారు" అని చంద్రబాబు పేర్కొన్నారు. వాజ్‌పేయి జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని చంద్రబాబు సూచించారు. ఒక సాధారణ కుటుంబంలో జన్మించి, తన అవిరళ కృషితో అత్యున్నత స్థాయికి ఎదిగారని గుర్తుచేశారు. తొమ్మిదిసార్లు లోక్‌సభకు, రెండుసార్లు రాజ్యసభకు ఎన్నికవ్వడమే ఆయన గొప్పతనానికి నిదర్శనమన్నారు. కేవలం 18 ఏళ్ల వయసులోనే క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న దేశభక్తుడని కొనియాడారు. 1998లో పోఖ్రాన్-2 అణుపరీక్షలు నిర్వహించి ప్రపంచానికి భారతదేశ సత్తాను చాటారని, కార్గిల్ యుద్ధంలో శత్రువులకు దీటైన జవాబు ఇచ్చారని ఆయన గుర్తుచేశారు. వాజ్‌పేయి హయాంలో చేపట్టిన స్వర్ణ చతుర్భుజి (గోల్డెన్ క్వాడ్రిలేటరల్) రహదారి ప్రాజెక్టు దేశ గతిని మార్చేసిందని చంద్రబాబు అన్నారు. టెలికాం, విమానయాన రంగాల్లో కీలక సంస్కరణలకు శ్రీకారం చుట్టింది కూడా ఆయనేనని తెలిపారు. "ఆయనతో నాకు వ్యక్తిగతంగా మంచి అనుబంధం ఉంది. రాష్ట్ర అభివృద్ధికి ఆయన ఎంతో సహాయం చేశారు. రాష్ట్రం తరపున ఏది అడిగినా కాదనే వారు కాదు. ప్రజలకు ఏది ఉపయోగమో అదే చేసేవారు. విధానాల రూపకల్పనలో చాలా వేగంగా నిర్ణయాలు తీసుకునేవారు" అని చంద్రబాబు తన పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఎన్టీఆర్, వాజ్‌పేయిలను చూస్తే సుపరిపాలన ఎలా ఉండాలో అర్థమవుతుందని చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఎన్టీఆర్ కూడా ఒక విలక్షణమైన వ్యక్తిత్వమున్న నేత అని, ఆయన ఎప్పుడూ ప్రజలకు మంచి చేయాలనే తపనతో ఉండేవారని అన్నారు. "అప్పుడు అణుపరీక్షలు అయినా, ఇప్పుడు సిందూర్ ఆపరేషన్ అయినా.. నిన్నటి చతుర్భుజి అయినా, నేటి సాగర్‌మాల అయినా.. అన్నీ ఎన్డీయే పాలనలో విజయవంతమైన కార్యక్రమాలే" అని చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ కూడా 2047 నాటికి దేశాన్ని ప్రథమ స్థానంలో నిలబెట్టేందుకు కృషి చేస్తున్నారని, యువతకు గొప్ప స్ఫూర్తినిస్తున్నారని ఆయన ప్రశంసించారు.

# ఏపీ ఆర్థిక వ్యవస్థ మళ్లీ పుంజుకుంది

**పీ-4 ఫౌండేషన్ వైస్ ఛైర్మన్ కుటుంబరావు**

అమరావతి, డిసెంబర్ 9 (ఈవార్తలు): గత ఐదేళ్ల విధ్వంసకర పాలన నుంచి ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ బయటపడి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో తిరిగి వికాస పథంలోకి ప్రవేశించిందని స్వర్ణాంధ్ర పీ-4 ఫౌండేషన్ వైస్ ఛైర్మన్ సి.కుటుంబరావు అన్నారు. మంగళవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై కీలక గణాంకాలను వెల్లడించారు. చంద్రబాబు వెల్లడించిన ఆర్థిక గణాంకాలే రాష్ట్ర పురోగతికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. చంద్రబాబు నాయకత్వంలోనే స్వర్ణాంధ్ర సాధ్యమని అన్నారు. 2019-2024 మధ్య జగన్ పాలనలో రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్డీపీ)కి రూ.7 లక్షల కోట్లకు పైగా తీవ్ర నష్టం వాటిల్లిందని కుటుంబరావు ఆరోపించారు. ప్రతి ఏటా లక్ష నుంచి లక్షన్నర కోట్లు పెరగాల్సిన జీఎస్డీపీ తగ్గిపోవడంతో, రాష్ట్ర సొంత ఆదాయంలో రూ.70 వేల కోట్లకు పైగా కోత పడిందన్నారు. గత ప్రభుత్వం సక్రమంగా పనిచేసి ఉంటే, ఖజానాకు అదనంగా రూ.72 వేల కోట్లు వచ్చి ఉండేవని ఆయన విశ్లేషించారు. పొరుగు రాష్ట్రమైన తెలంగాణతో పోల్చినప్పుడు ఈ తేడా మరింత స్పష్టంగా కనిపిస్తోందని ఆయన వివరించారు. 2014-19 మధ్య ఏపీ జీఎస్డీపీ వృద్ధి రేటు 13.21 శాతం ఉండగా, తెలంగాణది 13.5 శాతం అని, దాదాపు సమానంగా ఉన్నాయని తెలిపారు. కానీ, 2019-24 మధ్య జగన్ పాలనలో ఏపీ వృద్ధి రేటు 9.1 శాతానికి



పడిపోగా, తెలంగాణ 11 శాతం వృద్ధిని నమోదు చేసిందని పేర్కొన్నారు. దీని ఫలితంగా ఏపీ తలసరి ఆదాయం రూ.2.66 లక్షల వద్దే ఆగిపోగా, తెలంగాణ రూ.3.87 లక్షలకు చేరిందని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు తిరిగి అధికారం చేపట్టిన 18 నెలల్లోనే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టారని కుటుంబరావు ప్రశంసించారు. వ్యవసాయ రంగంలో 34-35 శాతం జీఎస్డీపీ లక్ష్యంలో ఇప్పటికే 65 శాతం చేరుకున్నామని, పరిశ్రమల రంగంలో 45 శాతం లక్ష్యాన్ని సాధించామని తెలిపారు. ఐటీ, టూరిజం, లాజిస్టిక్స్ వంటి సేవల రంగం నిర్దేశిత లక్ష్యాన్ని మించి రాణించబోతోందని ధీమా వ్యక్తం చేశారు. విశాఖను ఐటీ హబ్‌గా తీర్చిదిద్దడం, ఏపీ లాజిస్టిక్ కార్పొరేషన్‌ను క్రమబద్ధీకరించడం వంటి ప్రణాళికలతో ముందుకు వెళుతున్నామన్నారు. గత ప్రభుత్వ హయాంలో జల్ జీవన్ మిషన్, పీఎం ఆవాస్ యోజన వంటి కేంద్ర పథకాలకు రాష్ట్ర వాటా ఇవ్వలేదని, పునరుత్పాదక ఇంధన సంస్థలను బ్లాక్‌మెయిల్ చేసి, పరిశ్రమలను బెదిరించి తరిమేశారని కుటుంబరావు తీవ్రంగా విమర్శించారు.



## అవినీతిని నిర్మూలిద్దాం.. దేశాన్ని అభివృద్ధి చేద్దాం

**అవినీతి నిర్మూలనలో అందరూ భాగస్వాములు కావాలి**

**1064 టోల్ ఫ్రీ నెంబర్ తో అవినీతికి అడ్డుకట్ట**

**జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్**

**అవినీతి నిరోధక వారోత్సవాలు పోస్టర్ ఆవిష్కరణ**

జగిత్యాల, డిసెంబర్ 9 (ఈవార్తలు): అవినీతి నిర్మూలనకు ప్రతి ఒక్కరు కట్టుబడి ఉండాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్ పిలుపునిచ్చారు. ఎవరైనా లంచం అడిగితే 1064 టోల్ ఫ్రీ నెంబర్ కు కాల్ చేసి ఫిర్యాదు చేయడం ద్వారా అవినీతికి అడ్డుకట్ట వేయవచ్చని సూచించారు. మంగళవారం కలెక్టరేట్ చాంబర్‌లో అవినీతి నిరోధక దినోత్సవాన్ని పురస్కరించుకొని విజిలెన్స్ వారోత్సవాలు పోస్టర్‌ను కలెక్టర్, ఎస్పీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఉద్యోగులు, అధికారులు తమ విధి నిర్వహణలో జాగ్రత్తగా ఉంటూ బాధ్యతతో వ్యవహరించాలని అన్నారు. నిబద్ధతతో పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అవినీతి, అక్రమాల నిర్మూలనలో అందరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, రద్దీ ప్రాంతాల్లో పోస్టర్లను అంటించి ప్రజల్ని చైతన్యవంతం చేయాలని సూచించారు.కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బీఎస్ లత, బీ రాజాగౌడ్, ఆర్డీవో మధుసూదన్, విజిలెన్స్ సిబ్బంది, తదితరులుపాల్గొన్నారు.

## ఇండిగోను జాతీయం చేయండి: నారాయణ

విజయవాడ, డిసెంబర్ 9 (ఈవార్తలు): ఇండిగో వైఖరిపై రాజకీయ నేతల నుంచి తీవ్ర విమర్శలు వస్తున్నాయి. సీపీఐ అగ్రనేత నారాయణ ఈ విషయంపై ఘాటుగా స్పందించారు. ఇండిగో సంస్థను తక్షణమే జాతీయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రయాణికుల భద్రత కోసం కేంద్రం విధించిన నిబంధనలను పాటించకుండా ఇండిగో యాజమాన్యం బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించారు. పౌర విమానయాన రంగంలో ఇండిగోకు 64 శాతం వాటా ఉందని, ప్రభుత్వ రంగంలో విమానయాన సంస్థలు లేకపోవడం వల్లే ఇలాంటి సంక్షోభాలు తలెత్తుతున్నాయని నారాయణ విమర్శించారు.

## ఏపీకి 8 మంది 2024 బ్యాచ్ ఐఏఎస్‌లు

విజయవాడ, డిసెంబర్ 9 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిపాలనను బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 2024 బ్యాచ్‌కు చెందిన 8 మంది ఐఏఎస్ అధికారులను ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌కు కేటాయిస్తూ కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ (%ణశీూ%) ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి అధికారికంగా లేఖ ద్వారా సమాచారం అందించింది. దేశవ్యాప్తంగా ఈ బ్యాచ్‌లో మొత్తం 179 మంది ఐఏఎస్‌లుగా ఎంపిక కాగా, వారిలో 8 మందిని ఏపీకి కేటాయించారు. రాష్ట్రంలో పరిపాలనను మరింత వేగవంతం చేసి, ప్రభుత్వ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు ఈ కొత్త అధికారులు దోహదపడనున్నారు. త్వరలోనే వీరంతా రాష్ట్ర ప్రభుత్వంలో విధుల్లో చేరనున్నారు. ఏపీ క్యాడర్‌కు కేటాయించిన వారిలో తెలుగు రాష్ట్రాలకు చెందిన వారు కూడా ఉన్నారు. బన్నా వెంకటేశ్, ఏఆర్ పవన్ తేజ (ఆంధ్రప్రదేశ్), కె. ఆదిత్య శర్మ, చింతకింది శ్రవణ్ కుమార్ రెడ్డి (తెలంగాణ)లకు ఏపీ క్యాడర్ లభించింది. వీరితో పాటు హరి ఓం పాండియా (రాజస్థాన్), నమ్రతా అగర్వాల్ (హరియాణా), ప్రియ (ఢిల్లీ), సుయష్ కుమార్ (ఉత్తరప్రదేశ్) కూడా ఏపీకి రానున్నారు. అదే సమయంలో, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఇద్దరు అధికారులను ఇతర క్యాడర్లకు కేటాయించినట్లు డీవోపీటీ తన లేఖలో స్పష్టం చేసింది. చెన్నంరెడ్డి శివగణేష్‌రెడ్డిని ఏజీఎంయూటీ (అరుణాచల్ ప్రదేశ్, గోవా, మిజోరం, కేంద్ర పాలిత ప్రాంతాలు) క్యాడర్‌కు, పి.సురేశ్ ను తెలంగాణ క్యాడర్‌కు కేటాయించారు.

## సీల్డ్ కవర్‌లో పరకామణి చోరీ నివేదిక

అమరావతి, డిసెంబర్ 9 (ఈవార్తలు): తిరుమల శ్రీవారి పరకామణి చోరీ కేసులో లోక్ అదాలత్ ద్వారా కుదిరిన రాజీ వ్యవహారంపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో విచారణ కొనసాగుతోంది. ఈ కేసును దర్యాప్తు చేస్తున్న సీఐడీ ఈరోజు హైకోర్టుకు అదనపు నివేదికను సీల్డ్ కవర్‌లో సమర్పించింది. ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం ఈ కేసును విచారిస్తోంది. సీఐడీ సమర్పించిన నివేదికకు చెందిన మరో రెండు సెట్లను రిజిస్ట్రార్ (జ్యుడీషియల్) కు సీల్డ్ కవర్‌లో ఇవ్వాలని ఆదేశించింది. ఈ నివేదికలను పరిశీలన నిమిత్తం తమ ముందు ఉంచాలని రిజిస్ట్రీకి సూచించింది. లోక్ అదాలత్ అవార్డు చట్టబద్ధతపైనే ప్రధానంగా దృష్టి సారించిన న్యాయస్థానం, నివేదికను పరిశీలించాక తగిన ఉత్తర్వులు జారీ చేస్తామని స్పష్టం చేసింది. తదుపరి విచారణను బుధవారానికి వాయిదా వేసింది. గత ఏడాది ఏప్రిల్‌లో టీటీడీ మాజీ ఉద్యోగి రవికుమార్ సుమారు 900 అమెరికన్ డాలర్ల విదేశీ కరెన్సీని చోరీ చేస్తూ పట్టుబడ్డారు. అయితే, 2023 సెప్టెంబర్‌లో ఈ కేసు అనూహ్యంగా లోక్ అదాలత్‌లో రాజీకి వచ్చింది. ఈ రాజీలో భాగంగా నిందితుడు రవికుమార్ రూ.14 కోట్ల విలువైన ఏడు ఆస్తులను టీటీడీకి విరాళంగా ఇచ్చారని ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ రాజీని సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలు కావడంతో న్యాయస్థానం సీఐడీ, ఏసీబీ దర్యాప్తునకు ఆదేశించింది. మరోవైపు, ఈ కేసులో తొలుత ఫిర్యాదు చేసిన అప్పటి ఏవీఎస్ఓ సతీశ్ కుమార్ అనుమానాస్పద స్థితిలో మరణించడం కేసు తీవ్రతను మరింత పెంచింది.

## తిరుపతిలో ఈట్ స్ట్రీట్

**రెడీ అవుతున్న ఫుడ్ కోర్ట్**



తిరుపతి, డిసెంబర్ 9 (ఈవార్తలు): తిరుపతి నగరవాసులు, భక్తులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న 'ఈట్ స్ట్రీట్' (ఫుడ్ కోర్ట్) కల త్వరలోనే నెరవేరనుంది. నగరపాలక సంస్థ ప్రస్తుత కార్యాలయానికి ఎదురుగా ఉన్న అచ్యుత దేవరాయలు మార్గంలో ఫుడ్ కోర్ట్ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. మరో రెండు నెలల్లో దీనిని పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ఫుడ్ కోర్ట్‌లో మొత్తం 40 నుంచి 50 స్టాళ్లను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం 8/16 సైజులో ఉన్న 12 కంటైనర్లను ఆధునిక స్టాళ్లుగా మారుస్తున్నారు. మిగిలిన ఖాళీ స్థలాలను టెండర్ దక్కించుకున్న వారు స్టాళ్లుగా అభివృద్ధి చేసుకునేందుకు అనుమతిస్తారు. దాదాపు రూ.80 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టుకు నగరపాలక సంస్థ కౌన్సిల్ ఇప్పటికే ఆమోదం తెలిపింది. పనులు పూర్తయిన తర్వాత టెండర్ల ప్రక్రియ ద్వారా స్టాళ్లను కేటాయించనున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కపిలతీర్థం రోడ్డు, ఆర్టీసీ బస్టాండు వంటి ప్రాంతాల్లో ఫుడ్ కోర్ట్ ఏర్పాటుకు ప్రయత్నాలు జరిగినా అవి కార్యరూపం దాల్చలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కమిషనర్ మౌర్య ఈ ప్రాజెక్టుపై ప్రత్యేక శ్రద్ధ చూపించడంతో పనుల్లో వేగం పెరిగింది. నిత్యం వేలాదిగా తరలివచ్చే భక్తులకు, స్థానికులకు ఈ ఫుడ్ కోర్ట్ ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని భావిస్తున్నారు.

# మన అభివృద్ధి మన చేతుల్లోనే

**బయటి శక్తుల ఒత్తిడికి లొంగొద్దు**

**అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ**



ముంబై: భారత్ తన అభివృద్ధి మార్గాన్ని తానే నిర్దేశించుకోవాలని, బయటి శక్తుల నుంచి వచ్చే ఒత్తిళ్లను గట్టిగా ప్రతిఘటించాలని అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ అన్నారు. ఆర్థిక, వనరుల సార్వభౌమత్వం కోసం చేసే పోరాటాన్ని ఆయన 'రెండో స్వాతంత్ర్య సంగ్రామం'గా అభివర్ణించారు. ఇవాళ ఐఐటీ (ఇండియన్ స్కూల్ ఆఫ్ మైన్స్) ధన్‌బాద్ శతాబ్ది ఉత్సవాల్లో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. 21వ శతాబ్దంలో ఒక దేశ సార్వభౌమత్వం దాని సహజ వనరులు, ఇంధన వ్యవస్థలపై ఆధారపడి ఉంటుందని అదానీ స్పష్టం చేశారు. "మన కాళ్ల కింద ఉన్న వనరులను, మన ఎదుగుదలకు ఇంధనమైన శక్తిని మనం నియంత్రించాలి" అని ఆయన పిలుపునిచ్చారు. చారిత్రకంగా కర్బన ఉద్గారాలకు కారణమైన దేశాలే ఇప్పుడు అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రాధాన్యతలను నిర్దేశించే ప్రయత్నం చేస్తున్నాయని, దీన్నే 'కథన వలసవాదం' అని ఆయన విమర్శించారు. మన అభివృద్ధి ప్రయాణాన్ని మనం నియంత్రించకపోతే, మన ఆకాంక్షలను అణచివేస్తారని హెచ్చరించారు. ప్రపంచ గణాంకాలను ఉటంకిస్తూ, భారత్ నిర్దేశిత గడువు కంటే ముందే 50 శాతం శిలాజయేతర ఇంధన సామర్థ్యాన్ని సాధించిందని, అయినా తలసరి ఉద్గారాల్లో ప్రపంచంలోనే అత్యంత తక్కువ స్థాయిలో ఉందని గుర్తుచేశారు. తలసరి కొలమానాలు, చారిత్రక బాధ్యతలను పరిగణనలోకి తీసుకోకుండా భారత్ పనితీరును తక్కువ చేసే ప్రయత్నాలు పక్షపాతంతో కూడిన అంతర్జాతీయ ఈఎస్‌జీ ఫ్రేమ్‌వర్క్‌లను ప్రతిబింబిస్తాయని అన్నారు. మైనింగ్‌ను పాత ఆర్థిక వ్యవస్థ అని కొందరు అనొచ్చని, కానీ అది లేకుండా కొత్త ఆర్థిక వ్యవస్థ లేదని అదానీ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఐఐటీ ధన్‌బాద్ విద్యార్థుల కోసం రెండు కీలక కార్యక్రమాలను ప్రకటించారు. ఏటా 50 మందికి ప్రీ-ప్లేస్‌మెంట్ అవకాశాలతో కూడిన పెయిడ్ ఇంటర్న్‌షిప్‌లు, టెక్స్‌మిన్‌తో కలిసి మెటావర్స్ ల్యాబ్స్, డ్రోన్ టెక్నాలజీ వంటి అత్యాధునిక సౌకర్యాలతో 'అదానీ 3ఎస్ మైనింగ్ ఎక్సలెన్స్ సెంటర్' ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. భయపడకుండా కలలు కనాలని, ఆవిష్కరణలను అందిపుచ్చుకోవాలని విద్యార్థులకు ఆయన సూచించారు.

## రూ.1,300 కోట్ల లంచగొండికి ఉరి

**మాజీ అధికారికి చైనాలో మరణశిక్ష**

బీజింగ్: అవినీతిపై ఉక్కుపాదం మోపుతున్న చైనా ప్రభుత్వం, మరో ఉన్నతాధికారికి మరణశిక్ష అమలు చేసింది. ప్రభుత్వ ఆధీనంలోని అతిపెద్ద అసెట్ మేనేజ్‌మెంట్ సంస్థకు చెందిన మాజీ ఎగ్జిక్యూటివ్‌ను ఈరోజు ఉరితీసినట్లు ఆ దేశ అధికారిక మీడియా వెల్లడించింది. సుమారు 156 మిలియన్ డాలర్లకు పైగా (భారత కరెన్సీలో దాదాపు రూ.1,300 కోట్లు) లంచం తీసుకున్నట్లు ఆయనపై ఆరోపణలు రుజువయ్యాయి. వివరాల్లోకి వెళితే, చైనా హువారోంగ్ ఇంటర్నేషనల్ హోల్డింగ్స్ మాజీ జనరల్ మేనేజర్ బాయ్ తియాన్‌హుయ్‌పై భారీ అవినీతి ఆరోపణలు వచ్చాయి. 2014 నుంచి 2018 మధ్య కాలంలో పలు ప్రాజెక్టుల కొనుగోలు, ఫైనాన్సింగ్ విషయాల్లో అనుకూలంగా వ్యవహరించినందుకు ఆయన భారీ మొత్తంలో లంచాలు స్వీకరించినట్లు తేలింది. ఈ కేసులో తియాన్జిన్‌లోని ఓ కోర్టు ఈ ఏడాది మే నెలలో అతనికి మరణశిక్ష విధించింది. సాధారణంగా చైనాలో అవినీతి కేసుల్లో మరణశిక్ష విధించినా, రెండేళ్ల తర్వాత దానిని యావజ్జీవ కారాగార శిక్షగా మారుస్తుంటారు. కానీ, బాయ్ తియాన్‌హుయ్ విషయంలో శిక్షను నేరుగా అమలు చేయాలని కోర్టు తీర్పు ఇచ్చింది. ఈ తీర్పును ఆయన పైకోర్టులో అప్పీల్ చేసినప్పటికీ, అక్కడా వ్యతిరేకంగానే తీర్పు వచ్చింది. చివరికి దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీం పీపుల్స్ కోర్టు కూడా ఈ తీర్పును సమీక్షించి, శిక్షను ఖరారు చేసింది. "బాయ్ చేసిన నేరాలు అత్యంత తీవ్రమైనవి. ఆయన తీసుకున్న లంచం చాలా పెద్ద మొత్తం. దీనివల్ల దేశానికి, ప్రజలకు తీవ్ర నష్టం వాటిల్లింది" అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించినట్లు ప్రభుత్వ బ్రాడ్‌కాస్టర్ సీసీటీవీ పేర్కొంది. మంగళవారం ఉదయం తియాన్జిన్‌లో కుటుంబ సభ్యులతో చివరిసారిగా భేటీ అయిన అనంతరం బాయ్ కి మరణశిక్షను అమలు చేశారు. అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ అవినీతి నిర్మూలనపై దృష్టి సారించినప్పటి నుంచి హువారోంగ్ సంస్థ అధికారులే లక్ష్యంగా దర్యాప్తులు కొనసాగుతున్నాయి. ఇదే సంస్థ మాజీ చైర్మన్ లాయ్ జియామిన్‌ను కూడా 2021 జనవరిలో 253 మిలియన్ డాలర్ల లంచం కేసులో ఉరితీశారు. ఈ కఠిన చర్యలు స్వచ్ఛమైన పాలన కోసమేనని ప్రభుత్వం చెబుతుండగా, తన రాజకీయ ప్రత్యర్థులను తొలగించుకోవడానికే జిన్‌పింగ్ ఈ మార్గాన్ని ఎంచుకున్నారని విమర్శకులు ఆరోపిస్తున్నారు.

# నేటి నుంచే సోషల్ మీడియా బ్యాన్


**పిల్లలకు బాల్యం చెదరనీయకుండా చేద్దాం: ఆస్ట్రేలియా ప్రధాని**



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా ప్రభుత్వం చారిత్రక నిర్ణయం తీసుకుంది. దేశంలో 16 ఏళ్లలోపు పిల్లలు సోషల్ మీడియాను వినియోగించడంపై నిషేధం విధించింది. ఈ కొత్త, కఠిన నిబంధనలు బుధవారం నుంచి అధికారికంగా అమల్లోకి రానున్నాయి. ఈ సంస్కరణ ద్వారా పిల్లలకు వారి బాల్యం పోకుండా చూడచ్చని, తల్లిదండ్రులకు మరింత భరోసా ఇవ్వవచ్చని ఆస్ట్రేలియా ప్రధాని ఆంటోనీ అల్బనీస్ విశ్వాసం వ్యక్తం చేశారు. 2024 నవంబర్‌లో పార్లమెంట్ ఆమోదించిన చట్టాల ప్రకారం, 16 ఏళ్ల కంటే తక్కువ వయసున్న పిల్లలు ఖాతాలు కలిగి ఉండకుండా నిరోధించడానికి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, స్నాప్‌చాట్, టిక్‌టాక్, ఎక్స్ (ట్విట్టర్), యూట్యూబ్ సహా మొత్తం 10 ప్రముఖ ప్లాట్‌ఫామ్‌లకు ఈ ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ చట్టంలోని కీలక అంశం ఏమిటంటే, నిషేధాన్ని అమలు చేసే బాధ్యత పూర్తిగా సోషల్ మీడియా సంస్థలదే. ఒకవేళ పిల్లలు నిబంధనలు ఉల్లంఘించినా, వారికి గానీ వారి తల్లిదండ్రులకు గానీ ఎలాంటి శిక్షలు ఉండవు. ఐఏఎన్ఎస్ కథనం ప్రకారం, ఈ నిర్ణయానికి మద్దతు తెలిపినందుకు ఆస్ట్రేలియా రాష్ట్రాల అధినేతలకు ప్రధాని అల్బనీస్ ఈరోజు లేఖ రాశారు. "ఆస్ట్రేలియాకు అవసరమైన సాంస్కృతిక మార్పు ఇదే" అని ఆయన పేర్కొన్నట్టు తెలిసింది. సోషల్ మీడియాలోని కొన్ని డిజైన్లు యువతను స్క్రీన్‌లకు అతుక్కుపోయేలా ప్రోత్సహిస్తున్నాయని, వారి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది. 2025లో ప్రభుత్వం జరిపిన ఒక అధ్యయనంలో, 10-15 ఏళ్ల వయసున్న పిల్లల్లో 96 శాతం మంది సోషల్ మీడియా వాడుతున్నారని, వారిలో 70 శాతం మంది హింస, ఆత్మహత్యలను ప్రోత్సహించే కంటెంట్ వంటి హానికరమైన విషయాలను చూస్తున్నారని తేలింది. ఈ హానికరమైన ప్రభావాలను తగ్గించడమే ఈ నిషేధం ముఖ్య ఉద్దేశమని ప్రభుత్వం వివరించింది.

# కర్ణాటకకు మంచి జరగాలి

**సిద్ధరామయ్య కొడుకు వ్యాఖ్యలపై డీకే స్పందన**



బెంగళూరు: కర్ణాటక కాంగ్రెస్‌లో ముఖ్యమంత్రి పదవి వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కుమారుడు, ఎమ్మెల్సీ యతీంద్ర చేసిన వ్యాఖ్యలు, వాటిపై ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పందించిన తీరు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళితే... ముఖ్యమంత్రి మార్పు ఉండదని, సిద్ధరామయ్య పూర్తికాలం పదవిలో కొనసాగుతారని, డీకే శివకుమార్ డిమాండ్‌ను అధిష్ఠానం తోసిపుచ్చిందని యతీంద్ర సోమవారం వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై ఈ రోజు బెంగళూరులో మీడియా ప్రశ్నించగా.. డీకే శివకుమార్ కేవలం "చాలా సంతోషం. అంతా మంచే జరగాలి, రాష్ట్రానికి మంచి జరగాలి" అని క్లుప్తంగా బదులిచ్చారు. ఆ తర్వాత, శీతాకాల సమావేశాల కోసం బెళగావి విమానాశ్రయానికి చేరుకున్న డీకే శివకుమార్‌కు మద్దతుదారులు "డీకే నెక్ట్స్ సీఎం" అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. మరోవైపు డీకే సన్నిహితురాలైన మంత్రి లక్ష్మీ హెబ్బాల్కర్ సోదరుడు, ఎమ్మెల్సీ చన్నరాజ్ హట్టిహెూళి.. తన సోషల్ మీడియా ఖాతాలో డీకే శివకుమార్‌ను ముఖ్యమంత్రి అని సంబోధిస్తూ పోస్ట్ చేయడం కలకలం రేపింది. యతీంద్ర వ్యాఖ్యలు అనవసరమని చన్నరాజ్ అభిప్రాయపడ్డారు. సీఎం పదవిపై అధిష్ఠానం సరైన సమయంలో నిర్ణయం తీసుకుంటుందని చెప్పినప్పుడు, అంతవరకూ వేచి చూడాలని సూచించారు. ఈ పరిణామాలపై రవాణా శాఖ మంత్రి రామలింగారెడ్డి స్పందిస్తూ, పార్టీలో ఎలాంటి గందరగోళం లేదని, అధిష్ఠానం నిర్ణయమే అంతిమమని స్పష్టం చేశారు. అయితే, నేతలు బహిరంగ ప్రకటనలు చేసేటప్పుడు బాధ్యతాయుతంగా ఉండాలని హితవు పలికారు. మొత్తం మీద నేతలు సర్దిచెప్పే ప్రయత్నం చేస్తున్నప్పటికీ.. సీఎం కుర్చీ చుట్టూ ఇరు వర్గాల మద్దతుదారుల వ్యాఖ్యలు, నినాదాలు కర్ణాటక కాంగ్రెస్‌లో అంతర్గత పోరును మరోసారి బహిర్గతం చేశాయి.

## పాక్‌కు ఐఎంఎఫ్ 1.2 బిలియన్ డాలర్ల రుణం



ఇస్లామాబాద్: తీవ్ర ఆర్థిక సంక్షోభంతో సతమతమవుతున్న పాకిస్థాన్‌కు అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) భారీ ఊరట కల్పించింది. దేశంలో స్థూల ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడేందుకు సుమారు 1.2 బిలియన్ డాలర్ల కొత్త రుణాన్ని ఆమోదించింది. వరదలు, అధిక ద్రవ్యోల్బణం, తీవ్రమైన కోశపరమైన ఒత్తిళ్లను ఎదుర్కొంటున్న పాకిస్థాన్‌కు ఈ నిధులు అత్యంత కీలకం కానున్నాయి. ఐఎంఎఫ్ ఎగ్జిక్యూటివ్ బోర్డు.. పాకిస్థాన్ కోసం అమలు చేస్తున్న 'ఎక్స్‌టెండెడ్ ఫండ్ ఫెసిలిటీ', 'రెసిలియెన్స్ అండ్ సస్టెయినబిలిటీ ఫెసిలిటీ' కార్యక్రమాలపై సమీక్షలు పూర్తి చేసి ఈ నిర్ణయం తీసుకుంది. %జుఖీఖీ% కింద సుమారు 1 బిలియన్ డాలర్లు, ఆర్ఎస్ఎఫ్ కింద 200 మిలియన్ డాలర్లు విడుదల చేయనుంది. దీంతో ఈ రెండు ఒప్పందాల కింద ఇప్పటివరకు పాక్‌కు అందిన మొత్తం సాయం 3.3 బిలియన్ డాలర్లకు చేరినట్లు ఐఎంఎఫ్ ఒక ప్రకటనలో వెల్లడించింది. విధ్వంసకర వరదలు ఎదురైనప్పటికీ, పాకిస్థాన్ ప్రభుత్వం చేపట్టిన బలమైన ఆర్థిక కార్యక్రమాలు దేశంలో స్థిరత్వాన్ని కాపాడటంలో సహాయపడ్డాయని ఐఎంఎఫ్ ప్రశంసించింది. 2025 ఆర్థిక సంవత్సరంలో పాక్ జీడీపీలో 1.3 శాతం ప్రాథమిక మిగులును నమోదు చేసిందని, విదేశీ మారక నిల్వలు గత ఏడాదితో పోలిస్తే 9.4 బిలియన్ డాలర్ల నుంచి 14.5 బిలియన్ డాలర్లకు పెరిగాయని పేర్కొంది. అయితే, వరదల కారణంగా ఆహార ధరలు పెరగడంతో ద్రవ్యోల్బణం ఇంకా అధిక స్థాయిలోనే ఉందని తెలిపింది. పాకిస్థాన్ ఆర్థిక స్థిరత్వాన్ని మరింత బలోపేతం చేసుకోవడానికి వివేకవంతమైన విధానాలను కొనసాగించాలని ఐఎంఎఫ్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ నైగెల్ క్లార్క్ సూచించారు. ద్రవ్యోల్బణాన్ని అదుపు చేసేందుకు కఠిన ద్రవ్య విధానాన్ని కొనసాగించాలని, ఇంధన రంగంలో సంస్కరణలను వేగవంతం చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల పాలన మెరుగుపరచాలని ఆయన అన్నారు. వాతావరణ మార్పుల వల్ల పాక్‌కు పెను ముప్పు పొంచి ఉందని, విపత్తుల నివారణకు సమర్థమైన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని ఐఎంఎఫ్ నొక్కిచెప్పింది.




## తూచ్.. స్టార్‌లింక్ ధరలింకా ఫైనల్ కాలే

**వాస్తవ ధరలు కావంటూ స్పష్టతనిచ్చిన కంపెనీ**

న్యూఢిల్లీ: ప్రముఖ శాటిలైట్ ఇంటర్నెట్ సేవల సంస్థ స్టార్‌లింక్ ఇండియా వెబ్‌సైట్‌లో సోమవారం కొంత గందరగోళం నెలకొంది. భారత్‌లో అందించే సేవల ధరల వివరాలు వెబ్‌సైట్‌లో కనిపించడంతో అవి ఖరారయ్యాయని చాలామంది భావించారు. అయితే, ఇది కేవలం ఒక సాంకేతిక లోపం వల్లే జరిగిందని, ఆ ధరలు వాస్తవమైనవి కావని కంపెనీ స్పష్టతనిచ్చింది. వెబ్‌సైట్‌లో కనిపించిన వివరాల ప్రకారం నెలవారీ సేవలకు రూ.8,600, హార్డ్‌వేర్ కిట్ కోసం రూ.34,000 చెల్లించాలని ఉంది. ఈ విషయంపై స్పేస్‌ఎక్స్ వైస్ ప్రెసిడెంట్ లారెన్ డ్రేయర్ 'ఎక్స్' (ట్విట్టర్) ద్వారా స్పందించారు. "స్టార్‌లింక్ ఇండియా వెబ్‌సైట్ ఇంకా అధికారికంగా ప్రారంభం కాలేదు. మేము కస్టమర్ల నుంచి ఆర్డర్లు తీసుకోవడం లేదు. వెబ్‌సైట్‌లో కనిపించిన ధరలు కేవలం టెస్టింగ్ కోసం పెట్టిన డమ్మీ డేటా మాత్రమే. ఒక చిన్న కాన్ఫిగరేషన్ లోపం వల్ల అవి కనిపించాయి. దాన్ని వెంటనే సరిచేశాం" అని ఆమె వివరించారు. భారత్‌లో హై-స్పీడ్ ఇంటర్నెట్ సేవలు అందించడానికి తాము ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నామని, ప్రస్తుతం ప్రభుత్వ తుది అనుమతుల కోసం ప్రయత్నిస్తున్నామని డ్రేయర్ తెలిపారు. అనుమతులు రాగానే అధికారికంగా వెబ్‌సైట్, సేవల వివరాలను ప్రకటిస్తామని ఆమె పేర్కొన్నారు. ఇప్పటికే స్టార్‌లింక్ మహారాష్ట్ర ప్రభుత్వంతో ఒక ఒప్పందం కుదుర్చుకుంది. గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లోని ప్రభుత్వ సంస్థలకు ఇంటర్నెట్ సేవలు అందించేందుకు ఈ ఒప్పందం జరిగింది. మరోవైపు బెంగళూరు కేంద్రంగా పలు కీలక ఉద్యోగాలకు నియామకాలు చేపట్టడం ద్వారా భారత్‌లో కార్యకలాపాలను వేగవంతం చేసేందుకు స్టార్‌లింక్ సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.


## పర్లేదు.. మద్యం కొనుక్కోండి!

**మద్యం అమ్మకాలపై సౌదీ నిర్ణయం**

రియాద్: సౌదీ అరేబియా ప్రభుత్వం మద్యం అమ్మకాల విషయంలో మరో కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలో నివసిస్తున్న ముస్లిమేతర విదేశీయులకు మద్యం కొనుగోలు చేసేందుకు మరిన్ని సడలింపులు ఇచ్చింది. నెలకు 50,000 రియాళ్లు (సుమారు 13,300 డాలర్లు) లేదా అంతకంటే ఎక్కువ జీతం ఉన్నవారు ఇప్పుడు మద్యం కొనుగోలు చేయవచ్చు. ఈ నిబంధన ప్రకారం, అర్హులైన విదేశీయులు తమ జీతం వివరాలను ధ్రువీకరించే సర్టిఫికెట్‌ను చూపించి, రాజధాని రియాద్‌లో ఉన్న ఏకైక మద్యం విక్రయ కేంద్రంలోకి ప్రవేశం పొందాల్సి ఉంటుంది. గత ఏడాది విదేశీ దౌత్యవేత్తల కోసం ప్రారంభమైన ఈ స్టోర్‌లోకి, ఇప్పుడు 'ప్రీమియం రెసిడెన్సీ' హోదా కలిగిన ముస్లిమేతరులకు కూడా ప్రవేశం కల్పించారు. నెలవారీ పాయింట్ల ఆధారిత కోటా పద్ధతిలో ఇక్కడ అమ్మకాలు జరుగుతాయి. విదేశీ



నిపుణులను, పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలనే లక్ష్యంతో సౌదీ ప్రభుత్వం ఈ సామాజిక సంస్కరణలను చేపడుతోంది. రియాద్‌ను అంతర్జాతీయ వ్యాపార కేంద్రంగా తీర్చిదిద్దే ప్రయత్నాల్లో భాగంగానే ఈ సడలింపులు ఇస్తున్నట్లు తెలుస్తోంది. గత కొన్నేళ్లుగా సౌదీలో మహిళల డ్రైవింగ్‌పై నిషేధం ఎత్తివేయడం, సినిమా థియేటర్లు, వినోద కార్యక్రమాలకు అనుమతివ్వడం వంటి అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. రియాద్‌తో పాటు దేశంలోని మరో రెండు నగరాల్లో కూడా కొత్త మద్యం దుకాణాలను ఏర్పాటు చేయబోతున్నట్టు సమాచారం.



## ఉరళ్‌కుళి వద్దకు వెళ్లొద్దు

**అయ్యప్ప భక్తులకు కేరళ సర్కారు ఆదేశం**

శబరిమల: శబరిమల అయ్యప్ప దర్శనానికి వెళ్లే స్వాములు, భక్తులకు కేరళ అటవీ శాఖ అధికారులు ముఖ్యమైన సూచనలు చేశారు. వన్యప్రాణుల దాడులు, ప్రమాదాలు తరుచుగా జరుగుతున్నందున ఆలయం సమీపంలోని ఉరళ్‌కుళి జలపాతాన్ని సందర్శించవద్దని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు, ఆ ప్రాంతంలోని భద్రతా సమస్యలను దృష్టిలో ఉంచుకుని, భక్తుల భద్రత దృష్ట్యా సన్నిధానం స్పెషల్ డ్యూటీ రేంజ్ ఆఫీసర్ అరవింద్ బాలకృష్ణన్ ఈ సూచనలు జారీ చేశారు. అయ్యప్ప సన్నిధానానికి అటవీ మార్గం గుండా వెళ్లే కొందరు భక్తులు ఉరళ్‌కుళి జలపాతం వద్ద స్నానం చేసి స్వామిని దర్శించుకోవడానికి వెళుతున్నారని బాలకృష్ణన్ తెలిపారు. పండితవాళనికి సుమారు 400 మీటర్ల దూరంలో ఉన్న ఈ జలపాతం వద్ద ఇటీవల తరుచుగా ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. వన్యప్రాణుల సంరక్షణ చట్టం ప్రకారం ఈ ప్రాంతంలోకి ప్రవేశం పూర్తిగా నిషేధించబడిందని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రాంతంలో ఏనుగుల గుంపు సంచరిస్తూ ఉంటుందని, ముఖ్యంగా సాయంత్రం వేళల్లో ఈ జలపాతానికి దూరంగా ఉండాలని భక్తులకు సూచించారు. జలపాతానికి వెళ్లే మార్గం జారే స్వభావం కలిగి ఉండటం వల్ల తరుచుగా ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. కాబట్టి, శబరిమల వచ్చే భక్తులు ఈ ఆదేశాలను తప్పకుండా పాటించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## ఆరుగురు పాక్ సైనికులు మృతి

**పాక్-ఆఫ్ఘన్ సరిహద్దులో ఉద్రిక్తత**

ఇస్లామాబాద్: పాకిస్థాన్‌లోని వాయవ్య ప్రాంతంలో ఉగ్రవాదులు మరోసారి పంజా విసిరారు. ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లోని కుర్రం జిల్లాలో ఉన్న ఓ సెక్యూరిటీ చెక్‌పోస్ట్‌పై సాయుధుల బృందం దాడి చేసింది. నిన్న రాత్రి జరిగిన ఈ ఘటనలో ఆరుగురు సైనికులు ప్రాణాలు కోల్పోగా, మరో నలుగురు గాయపడ్డారు. భద్రతా దళాలు, ఉగ్రవాదుల మధ్య తీవ్రస్థాయిలో కాల్పులు జరిగాయని స్థానిక అధికారులు తెలిపారు. ఈ ఎదురుకాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదులు కూడా హతమయ్యారని ఏఎఫ్‌పీ వార్తా సంస్థ తన కథనంలో పేర్కొంది. ఈ దాడికి తామే బాధ్యత వహిస్తున్నట్లు పాకిస్థాన్ తాలిబన్ (టీటీపీ) ప్రకటించింది. గత కొన్నేళ్లుగా పాకిస్థాన్ సరిహద్దు ప్రాంతాల్లో టీటీపీ దాడులు పెరిగాయి. వీరికి ఆఫ్ఘనిస్థాన్‌లోని తాలిబన్ ప్రభుత్వం ఆశ్రయం కల్పిస్తోందని పాకిస్థాన్ ఆరోపిస్తోంది. అయితే, ఈ ఆరోపణలను కాబూల్ ఖండిస్తోంది. ఇది పాకిస్థాన్ అంతర్గత భద్రతా సమస్య అని స్పష్టం చేస్తోంది. ఇటీవలే ఇరు దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతలను తగ్గించేందుకు ఖతార్, టర్కీ, సౌదీ అరేబియా మధ్యవర్తిత్వంతో కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. అయినప్పటికీ, సరిహద్దుల్లో ఉద్రిక్తతలు చల్లారడం లేదు. తరచూ కాల్పుల ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఆఫ్ఘన్ శరణార్థులను పాకిస్థాన్ బలవంతంగా వెనక్కి పంపడం కూడా ఈ ఉద్రిక్తతలకు మరింత ఆజ్యం పోస్తోంది.

## టెర్రరిస్ట్ ఆర్గనైజేషన్‌గా సీఏఐఆర్

**ప్రకటించిన ఫ్లోరిడా సర్కారు**

న్యూయార్క్: అమెరికాలోని ప్రముఖ ముస్లిం పౌర హక్కుల సంస్థ 'కౌన్సిల్ ఆన్ అమెరికన్-ఇస్లామిక్ రిలేషన్స్' ను 'విదేశీ టెర్రరిస్ట్ సంస్థ'గా గుర్తిస్తూ ఫ్లోరిడా గవర్నర్ రాన్ డిశాంటిస్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఆయన ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వులను జారీ చేశారు. సీఏఐఆర్ తో పాటు ముస్లిం బ్రదర్‌హుడ్‌ను కూడా ఈ జాబితాలో చేర్చారు. గత నెలలో టెక్సాస్ గవర్నర్ కూడా ఇదే తరహా నిర్ణయం తీసుకోవడం గమనార్హం. ఈ ఉత్తర్వుల ప్రకారం, ఈ రెండు సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధులు, కాంట్రాక్టులు, ఉద్యోగాలు అందకుండా ఫ్లోరిడా ఏజెన్సీలు చర్యలు తీసుకుంటాయి. ముస్లిం బ్రదర్‌హుడ్‌కు అనుబంధంగా సీఏఐఆర్ ఏర్పడిందని, వీరికి హమాస్‌తో సంబంధాలు ఉన్నాయని డిశాంటిస్ తన ఉత్తర్వుల్లో ఆరోపించారు. అయితే, అమెరికా ఫెడరల్ ప్రభుత్వం ఈ రెండు సంస్థలను టెర్రరిస్ట్ ఆర్గనైజేషన్లుగా గుర్తించలేదు. గవర్నర్ నిర్ణయంపై సీఏఐఆర్ తీవ్రంగా స్పందించింది. ఇది రాజ్యాంగ విరుద్ధమని, పరువు నష్టం కలిగించే చర్య అని పేర్కొంటూ డిశాంటిస్‌పై దావా వేయనున్నట్లు ఆ సంస్థ ఫ్లోరిడా చాప్టర్ ప్రకటించింది. ఫ్లోరిడా ప్రజల కంటే ఇజ్రాయెల్ ప్రభుత్వానికి సేవ చేసేందుకే డిశాంటిస్ ప్రాధాన్యత ఇస్తున్నారని సీఏఐఆర్ ఒక ప్రకటనలో ఆరోపించింది. "డిశాంటిస్ తన తొలి క్యాబినెట్ సమావేశాన్ని ఇజ్రాయెల్‌లో నిర్వహించారు. ఫ్లోరిడా పన్ను చెల్లింపుదారుల డబ్బును ఇజ్రాయెల్ బాండ్లకు మళ్లించారు. ఇప్పుడు ఇజ్రాయెల్‌ను విమర్శిస్తున్న అమెరికన్ ముస్లింల గొంతు నొక్కేందుకు ప్రయత్నిస్తున్నారు" అని సీఏఐఆర్ విమర్శించింది. టెక్సాస్ గవర్నర్ నిర్ణయాన్ని కూడా ఆ సంస్థ ఇప్పటికే కోర్టులో సవాలు చేసింది.

## ప్రభుత్వ విధానాలు ప్రజలకు చేటు కావొద్దు

**'ఇండిగో' సంక్షోభంపై స్పందించిన మోదీ**

న్యూఢిల్లీ: ఇండిగో విమానాల రద్దుతో దేశవ్యాప్తంగా ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బంది పడిన విషయం తెలిసిందే. పైలట్లు అందుబాటులో లేక విమానాలు ఆలస్యం కావడం, రద్దు కావడం జరిగిందని అధికారులు చెబుతుండగా.. డీజీసీఏ రూల్స్ వల్లే ఇబ్బంది కలిగిందనే ఆరోపణలు వినిపించాయి. ఇండిగో సంక్షోభం నేపథ్యంలో పైలట్ల విశ్రాంతికి సంబంధించిన నిబంధనలను డీజీసీఏ సడలించిన విషయం తెలిసిందే. తాజాగా ఇండిగో సంక్షోభంపై ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. మంగళవారం ఉదయం ఎన్డీయే నేతలతో జరిగిన భేటీలో ఇండిగో విమానాల రద్దు కారణంగా ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులను ప్రధాని ప్రస్తావించారని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు మీడియాకు వెల్లడించారు. ప్రభుత్వం తీసుకొచ్చే నిబంధనలు వ్యవస్థలను మెరుగుపరిచేలా ఉండాలే తప్ప ప్రజలను ఇబ్బంది పెట్టేలా వుండకూడదని ప్రధాని వ్యాఖ్యానించినట్లు మంత్రి తెలిపారు. ప్రభుత్వ విధానాల వల్ల ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని మోదీ చెప్పారన్నారు. "నియమ నిబంధనలు మంచివే.. అయితే, అవి వ్యవస్థలను మెరుగుపరచాలి, ప్రజలను ఇబ్బంది పెట్టకూడదు" అని మోదీ అన్నట్లు రిజిజు తెలిపారు.

## కరెంట్ తీగలను ఢీకొని కూలిన విమానం

భోపాల్: మధ్యప్రదేశ్ లోని సివనీలో ఓ శిక్షణ విమానం నేల కూలింది. ల్యాండయ్యే క్రమంలో హైటెన్షన్ విద్యుత్ తీగలకు తాకడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో పైలట్‌తోపాటు మరొకరికి గాయాలయ్యాయి. విమానం తాకడంతో విద్యుత్ వైర్లు తెగిపడి సుమారు 90 గ్రామాల్లో అంధకారం నెలకొంది. వివరాల్లోకి వెళితే.. రెడ్‌బర్డ్ ఏవియేషన్ సంస్థకు చెందిన ఓ శిక్షణ విమానం సుక్తరా ఎయిర్ స్ట్రిప్ లో ల్యాండయ్యే క్రమంలో ప్రమాదానికి గురైంది. రన్ వేకు దాదాపు రెండు కిలోమీటర్ల దూరంలోని అమ్గావ్ గ్రామంలో 33కేవీ హైటెన్షన్ తీగలను తాకి నేలకూలింది. ఈ ప్రమాదంలో పైలట్ అజిత్ ఛావ్డాతో పాటు మరొకరు గాయపడ్డారని అధికారులు తెలిపారు. విమానం పడిపోవడం గమనించిన గ్రామస్థులు, విద్యుత్ సిబ్బంది సాయంతో పైలట్ ను రక్షించారు. ప్రస్తుతం వారు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, వారికి ప్రాణాపాయం తప్పిందని వైద్యులు తెలిపినట్లు వెల్లడించారు. కాగా, విమానం ఢీకొనడంతో విద్యుత్ తీగలు తెగిపడ్డాయని, దీని కారణంగా చుట్టుపక్కల దాదాపు 90 గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని అధికారులు తెలిపారు.

వయ్యారి చిత్రం






## 3 ఇడియట్స్ సీక్వెల్ కథ రెడీ

త్రీ ఇడియట్స్ సీక్వెల్‌పైఅదిరిపోయే అప్‌డేట్ వచ్చేసింది. స్రిప్ట్ ఫైనల్ అయింది. టీం చాలా ఎక్జయిటింగ్‌గా ఉంది. ఫస్ట్ పార్ట్ మ్యాజిక్ మళ్లీ రిపీట్ అవుతుందని నటీనటులు భావిస్తున్నారు. సుమారు 15 ఏండ్ల తర్వాత కథలోని పాత్రలు క్లైమాక్స్ సీన్‌లో మళ్లీ కలిసి కొత్త అడ్వెంచర్‌ను మొదలుపెడతాయని తాజా కథనం ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. రాజ్ కుమార్ హిరానీ అమీర్ ఖాన్‌తో చేయబోయే దాదా సాహెబ్ ఫాల్కే బయోపిక్ నిలిచిపోవడంతో ఈ డైరెక్టర్ త్రీ ఇడియట్స్ సీక్వెల్‌పై ఫోకస్ పెట్టాడని బీటౌన్ సర్కిల్ సమాచారం. రాజ్ కుమార్ హిరానీ త్రీ ఇడియట్స్ సీక్వెల్‌ను పూర్తి స్థాయి స్రీన్ ప్లే ఉండేలా ప్లాన్ చేసుకున్నాడట.

## నీలాంబరి టైటిల్‌తో నరసింహ-2?




సూపర్ స్టార్ రజనీకాంత్ పుట్టినరోజు సందర్భంగా తన అభిమానులకు భారీ సర్‌ప్రైజ్ ఇవ్వబోతున్నారు. రజనీ కెరీర్‌లో సంచలనం సృష్టించిన బ్లాక్‌బస్టర్ నరసింహ ప్రపంచవ్యాప్తంగా భారీ ఎత్తున రీ-రిలీజ్ అవుతోంది. ఈ ప్రత్యేక సందర్భాన్ని పురస్కరించుకుని రజనీకాంత్ మాట్లాడుతూ.. 'నరసింహ సీక్వెల్ గురించి చర్చలు జరుగుతున్నాయి. 'నీలాంబరి' అనే టైటిల్‌తో తీసే ఆలోచనలో ఉన్నాం' అని తెలిపారు. అయితే అభిమానుల్లో ఒక్క సందేహం కలిగింది. చిత్రంలో రమ్యకృష్ణ పోషించిన నీలాంబరి పాత్ర క్లైమాక్స్‌లో మరణిస్తుంది. మరి సీక్వెల్‌ను ఎలా తీర్చిదిద్దుతారు? ఫ్లాష్‌బ్యాక్ లేదా కొత్త యాంగిల్‌తో వస్తారా? అన్న చర్చ మొదలైంది. నీలాంబరి పాత్ర ఇప్పటికీ కల్ట్. రమ్యకృష్ణ అద్భుత నటన ప్రేక్షకుల మదిలో నిలిచిపోయింది. ఇప్పుడు సీక్వెల్ వస్తే ఫ్లాష్‌బ్యాక్ కథనంగా ఉండవచ్చు. లేదా నీలాంబరి పేరుతో పూర్తిగా కొత్త కాన్సెప్ట్ తీసే అవకాశం ఉంది.

## టాక్సిక్ రక్తపాతం..

కన్నడ స్టార్ యశ్ నటిస్తున్న లేటెస్ట్ చిత్రం టాక్సిక్. ఈ సినిమాను గీతూ దాస్ డైరెక్ట్ చేస్తుండగా పీరియాడిక్ గ్యాంగ్‌స్టర్ డ్రామాగా ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. కాగా, ఈ సినిమా నుండి తాజాగా ఓ ఇంటెన్స్ పోస్టర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. 2026 మార్చి 19న టాక్సిక్ చిత్రాన్ని రిలీజ్ చేస్తున్నట్లు కన్ఫర్మ్ చేశారు. ఇక టాక్సిస్ గ్యాంగ్‌స్టర్ రాకకు మరో 100 రోజులు మాత్రమే ఉందని కౌంట్‌డౌన్ షురూ చేశారు. ఈ సినిమాలో కియారా అద్వానీ, నయనతార, తారా సుతారియా, రుక్మిణి వసంత్, హుమా ఖురేషీ తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను కెవిఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ బ్యానర్లు సంయుక్తంగా ప్రొడ్యూస్ చేస్తున్నాయి.






## ప్రోమో కేక!

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'. దర్శకుడు హరీశ్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా నుంచి తాజాగా ఓ అదిరిపోయే అప్‌డేట్ వచ్చింది. చిత్రంలోని తొలి పాట 'దేఖ్ లేంగే సాలా' ప్రోమోను చిత్రబృందం విడుదల చేసింది. ఈ పూర్తి పాటను డిసెంబర్ 13న విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. తాజా ప్రోమో పవన్ ఫ్యాన్స్ అంచనాలకు తగ్గట్టుగానే ఉంది. పవన్ కల్యాణ్ ఎనర్జీ, దేవిశ్రీ ప్రసాద్ అందించిన పవర్‌ఫుల్ మ్యూజిక్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ప్రతి ప్లేలిస్ట్, డ్యాన్స్ ఫ్లోర్‌ను ఈ పాట ఏలుతుందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేసింది. ఈ మాస్ బీట్‌కు ప్రముఖ గాయకుడు విశాల్ దద్లానీ గాత్రం అందించగా, భాస్కరభట్ల సాహిత్యం సమకూర్చారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో పవన్ సరసన శ్రీలీల కథానాయికగా నటిస్తోంది. ప్రస్తుతం ఈ సాంగ్ ప్రోమో సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉంది. పూర్తి పాట కోసం అభిమానులు ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు.



## నేను దురదృష్టవంతుడిని


**దర్శకుడు సందీప్ రాజ్**

'కలర్ ఫొటో' సినిమాతో నేషనల్ అవార్డు అందుకున్న దర్శకుడు సందీప్ రాజ్ తన తాజా చిత్రం మోగ్లీ తో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. అయితే, సినిమా విడుదల విషయంలో ఇబ్బందులు వస్తున్నాయని సందీప్ రాజ్ తన ఆవేదన వ్యక్తం చేశాడు. కలర్ ఫొటో, మోగ్లీ వంటి సినిమాలు నాకు బదులుగా మరొక దర్శకుడికి తీయాల్సింది. ఈ రెండు చిత్రాలు.. సినిమా అంటే పడి చచ్చి, పని పట్ల ఎంతో నిబద్ధత, అభిరుచి ఉన్న వ్యక్తుల బృందమేతీసింది. ఈ రెండు సినిమాల్లో ఉన్న రెండు కామన్ విషయాలు ఏంటంటే.. అన్నీ బాగా జరుగుతున్నాయని అనుకున్న సమయంలో వాటి విడుదల విషయంలో దురదృష్టాన్ని ఎదుర్కోవడం. ఇంకోటి.. 'నేను' అని తెలిపాడు. 'బహుశా ఆ బ్యాడ్ లక్ నేనేనేమో. నాకు కూడా అలాగే అనిపించడం మొదలైంది. థియేటర్‌లలో దర్శకత్వం: సందీప్ రాజ్ అనే టైటిల్‌ను చూసే నా కల రోజురోజుకూ కష్టమవుతోంది. సిల్వర్‌స్క్రీన్ నన్ను ద్వేషిస్తుందేమో అనిపిస్తోంది. మోగ్లీ సినిమా రోషన్, సరోజ్, సాక్షి, హర్ష, డీవోపీ మారుతి, భైరవ వంటి ఎంతో మంది అంకితభావం ఉన్న వ్యక్తుల కష్టం, చెమట, రక్తంతో తయారైంది. కనీసం వారి కోసమైనా మోగ్లీకి అన్ని మంచి జరగాలని నేను నిజంగా ఆశిస్తున్నాను' అంటూ ఎమోషనల్ పోస్ట్ పెట్టాడు.

## మహావతార్‌లో దీపిక?



బాలీవుడ్ స్టార్ నటి దీపికా పదుకొణె తాజాగా మరో బంపరాఫర్ దక్కించుకున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే షారుఖ్ ఖాన్‌తో కింగ్ సినిమాతో పాటు అల్లు అర్జున్‌తో కలిసి అట్లీ దర్శకత్వంలో ఓ సినిమాలో నటిస్తోంది ఈ భామ. అయితే ఈ రెండు సినిమాలు కాకుండా మరో క్రేజీ ప్రాజెక్ట్‌లో దీపిక భాగం కాబోతున్నట్లు సమాచారం. దర్శకుడు అమర్ కౌశిక్ బాలీవుడ్ నటుడు విక్కీ కౌశల్‌తో కలిసి తీస్తున్న 'మహావతార్' సినిమాలో దీపికను తీసుకోబోతున్నట్లు సమాచారం. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్ గురించి సంప్రదింపులు జరుపగా దీపికా కూడా ఒకే చెప్పినట్లు తెలుస్తోంది. పరశురాముడి జీవిత కథ ఆధారంగా రూపొందనున్న ఈ ప్రాజెక్ట్‌లో దీపికా పదుకొణె పాత్రకు చాలా ప్రాధాన్యత ఉ ంటుందని, ఆ పాత్రకు ఆమె వంద శాతం న్యాయం చేయగలరని చిత్ర యూనిట్ బలంగా విశ్వసిస్తోందట.



## ఇక బయోపిక్ టైం అంటున్న తమన్నా

కొన్నాళు ్లగా తమన్నా ఐటెం సాంగ్స్‌తోనే అలరిస్తోంది. అయితే, ఇప్పుడు తన రూట్ మార్చి ఓ బాలీవుడ్ బయోపిక్ లో కీలక పాత్ర పోషించబోతోంది. లెజండరీ డైరెక్టర్ వీ శాంతారామ్ జీవిత చరిత్ర ఆధారంగా బాలీవుడ్ లో ఓ సినిమా తెరకెక్కుతుండగా అందులో శాంతారామ్ రెండో భార్య, ఒకప్పటి నటి జయశ్రీ గడ్కర్ పాత్రలో తమన్నా కనిపించబోతోంది. రీసెంట్‌గా మేకర్స్ ఆ సినిమా నుంచి తమన్నా ఫస్ట్ లుక్ పోస్టర్ ను రిలీజ్ చేయగా, అందులో తమన్నా వింటేజ్ సెటప్‌లో చీర కట్టులో ఎంతో అందంగా మెరిశారు.

## పవన్‌కు నటించడం రాదు: జయసుధ



ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై ప్రముఖ సినీ నటి జయసుధ ప్రశంసలు కురిపించారు. మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ, పవన్ కల్యాణ్ వ్యక్తిత్వంలో నటన ఉండదని అన్నారు. ఆయన వైఖరి ఆయనదేనని పేర్కొన్నారు. గతంలో ఎలా ఉన్నారో ఇప్పుడు కూడా ఆయన అలాగే ఉన్నారని వెల్లడించారు. ఆయనలో ఎలాంటి మార్పు లేదని అన్నారు. పవన్ సినిమాల్లో ఎవరికీ తలవంచలేదని అన్నారు. ఇప్పుడు రాజకీయాల్లో కూడా ఎవరికీ తలొగ్గడం లేదని తెలిపారు. పవన్ కల్యాణ్‌కు ఒక ప్రత్యేక శైలి ఉందని, ఆయనకు ఒక మార్గం ఉందని, దాని ప్రకారమే ముందుకు సాగుతారని అన్నారు. లేదంటే ఆయన ఎప్పుడో మధ్యలోనే వదిలి వెళ్లిపోయేవారని అభిప్రాయపడ్డారు. ఆయన పడిన కష్టం, ఆయన వ్యక్తిత్వం ఆయనను ఈ స్థాయికి తీసుకువచ్చిందని కొనియాడారు.



# షఫాలీ వర్మ రీఎంట్రీ

**శ్రీలంకతో టీ20లకు టీమిండియా ఎంపిక**

మహిళల వన్డే ప్రపంచకప్ ఫైనల్‌లో అద్భుత ప్రదర్శనతో జట్టు విజయంలో కీలకపాత్ర పోషించిన స్టార్ ఓపెనర్ షఫాలీ వర్మ, తిరిగి భారత జట్టులోకి వచ్చింది. శ్రీలంకతో స్వదేశంలో జరగనున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ కోసం 15 మంది సభ్యులతో కూడిన భారత జట్టును బీసీసీఐ మంగళవారం ప్రకటించింది. ఈ సిరీస్ డిసెంబర్ 21న ప్రారంభం కానుంది. ఈ సిరీస్‌కు హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్‌గా, స్మృతి మంధాన వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. అండర్-19 మహిళల టీ20 ప్రపంచకప్‌లో భారత్ తరఫున ఆడిన జి. కమలిని, వైష్ణవి శర్మలకు తొలిసారి జాతీయ జట్టులో అవకాశం దక్కింది. తెలుగమ్మాయిలు శ్రీ చరణి (ఏపీ), అరుంధతి రెడ్డి (తెలంగాణ) జట్టులో తమ స్థానాలను పదిలం చేసుకున్నారు. "శ్రీలంక మహిళలతో జరగబోయే ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ కోసం భారత జట్టును మహిళల సెలక్షన్ కమిటీ ఎంపిక చేసింది" అని బీసీసీఐ ఒక ప్రకటనలో తెలిపింది. సిరీస్‌లోని తొలి రెండు మ్యాచ్‌లకు విశాఖపట్నం ఆతిథ్యం ఇవ్వనుంది. డిసెంబర్ 21, 23 తేదీల్లో ఇక్కడే మ్యాచ్‌లు జరుగుతాయి. ఆ తర్వాత చివరి మూడు టీ20లు తిరువనంతపురంలో డిసెంబర్ 26, 28, 30 తేదీల్లో నిర్వహించనున్నారు. 2026లో ఇంగ్లండ్‌లో జరగనున్న ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్‌కు సన్నాహకంగా ఇరు జట్లకు ఈ సిరీస్ కీలకం కానుంది.

**భారత జట్టు:** హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), దీప్తి శర్మ, స్నేహ్ రాణా, జెమీమా రోడ్రిగ్స్, షఫాలీ వర్మ, హర్లీన్ డియోల్, అమన్‌జోత్ కౌర్, అరుంధతి రెడ్డి, క్రాంతి గౌడ్, రేణుకా సింగ్ ఠాకూర్, రిచా ఘోష్ (వికెట్ కీపర్), జి. కమలిని (వికెట్ కీపర్), శ్రీ చరణి, వైష్ణవి శర్మ.

## ఐపీఎల్ బోరింగ్ టోర్నీ: వసీం అక్రమ్

ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్)పై పాకిస్థాన్ మాజీ క్రికెటర్ వసీం అక్రమ్ తన అక్కసు వెల్లగక్కాడు. ఐపీఎల్ ముగిసేలోపు ఓ పిల్లాడు పుట్టి పెద్దవాడవుతాడని వ్యంగ్యాస్త్రాలు సంధించాడు. ఎక్కువ రోజులు జరగడం వల్ల ఐపీఎల్‌లో నాణ్యత కొరవడుతుందని అభిప్రాయపడ్డాడు. పాకిస్థాన్ సూపర్ లీగ్(పీఎస్ఎల్) 2026 సీజన్ ప్రమోషన్స్‌లో భాగంగా లండన్ వేదికగా పాకిస్థాన్ క్రికెట్ బోర్డు(పీసీబీ) నిర్వహించిన కార్యక్రమానికి వసీం అక్రమ్ హాజరయ్యాడు. పీసీబీ ఛైర్మన్ మోహసిన్ నఖ్వీ, బాబర్ ఆజామ్, హారిస్ రౌఫ్‌లు కూడా ఈ కార్యక్రమానికి వచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడిన వసీం అక్రమ్.. పీఎస్ఎల్‌ను ఐపీఎల్‌తో పోల్చాడు. ఐపీఎల్ ఎక్కువ రోజుల పాటు జరుగుతుండటంతో బోరింగ్‌గా మారిందన్నాడు. 'పుట్టిన పిల్లవాడు కూడా పెద్దవాడవుతాడు. కానీ ఐపీఎల్ మాత్రం ముగియదు. మా పీఎస్ఎల్ అలా కాదు. 34-35 రోజుల్లోనే పూర్తవుతుంది. బహుషా వచ్చే ఏడాది మరికొన్ని రోజులు పెరగవచ్చు. నేను తరుచుగా విదేశీ ఆటగాళ్లతో మాట్లాడినప్పుడు పీఎస్ఎల్ బౌలింగ్ నాణ్యతను ప్రశంసిస్తారు. ఐపీఎల్, ఇతర లీగ్‌ల కంటే నాణ్యత పరంగా పీఎస్ఎల్ నెంబర్ వన్ అంటున్నారు.'అని ఐపీఎల్ బౌలింగ్‌ను విమర్శించాడు.

## పడిపోయిన ఐపీఎల్ వాల్యూ

ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్) ఎకోసిస్టమ్ విలువ దారుణంగా పడిపోయింది. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది ఐపీఎల్ బ్రాండ్ వాల్యూ 20 శాతం తగ్గిందని బ్రాండ్ ఫైనాన్స్ అనే సంస్థ తమ నివేదికలో పేర్కొంది. మెగా వేలం, జట్ల పునర్వ్యవస్థీకరణతో పాటు లీగ్ మధ్య ఏర్పడిన భౌగోళిక రాజకీయ అవాంతరాలు ఐపీఎల్ విలువను తగ్గించాయని తెలిపింది. బ్రాండ్ వాల్యుయేషన్ కన్సల్టెన్సీ సంస్థ అయిన బ్రాండ్ ఫైనాన్స్ విడుదల చేసిన ఈ వార్షిక నివేదికలో గతేడాది ఐపీఎల్ ఎకోసిస్టమ్ విలువ 12 బిలియన్ల అమెరికా డాలర్లుగా ఉండగా.. ఈ ఏడాది 9.6 బిలియన్ల అమెరికా డాలర్లకు పడిపోయింది. 'భారత్, పాకిస్థాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా ఐపీఎల్ 2025 సీజన్ వారం పాటు వాయిదా పడటంతో పాటు మెగా వేలంలో జరిగిన తప్పిదాలు, జట్టు కూర్పు విషయంలో జట్లు చేసిన తప్పిదాలతో ఈ పరిస్థితి ఏర్పడింది. వేలం తప్పిదాల కారణంగా రసవత్తరమైన మ్యాచ్‌లు ఎక్కువగా జరగలేకపోయాయి'అని బ్రాండ్ ఫైనాన్స్ తమ నివేదికలో పేర్కొంది. అటు.. జట్ల పరంగా అత్యధిక బ్రాండ్ వాల్యూ కలిగిన జట్టుగా ముంబై ఇండియన్స్ నిలిచింది. గతేడాదితో పోల్చితే ఆ జట్టు విలువ 9 శాతం తగ్గినా.. 108 మిలియన్ డాలర్ల బ్రాండ్ వాల్యూతో ముంబై ఇండియన్స్ అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది.



# పాండ్యా కామియో

### రఫ్ఫాడించిన హార్దిక్.. లక్ష్య ఛేదనలో తడబడ్డ సఫారీలు

**74 పరుగులకే ఆలౌట్.. 101 పరుగుల తేడాతో టీమిండియా భారీ విజయం**

సౌతాఫ్రికాతో ఐదు టీ20ల సిరీస్‌లో టీమిండియా శుభారంభం చేసింది. కటక్ వేదికగా మంగళవారం జరిగిన తొలి మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన భారత్ 101 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది.

**భారత బౌలర్ల ధాటికి సౌతాఫ్రికా బ్యాటర్లు పెవిలియన్‌కు క్యూ కట్టారు. దాంతో 74 పరుగులకే కుప్పకూలిన సౌతాఫ్రికా ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 175 పరుగులు చేసింది. హార్దిక్ పాండ్యా(28 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్స్‌లతో 59 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీతో రాణించాడు.**





సౌతాఫ్రికా బౌలర్లలో లుంగి ఎంగిడి(3/31) మూడు వికెట్లు తీయగా.. లుతో సిపమ్లా(2/38) రెండు వికెట్లు పడగొట్టాడు. డోనోవన్ ఫెర్రెరియా ఒక వికెట్ పడగొట్టాడు. అనంతరం సౌతాఫ్రికా 12.3 ఓవర్లలో 74 పరుగులకు కుప్పకూలింది. డెవాల్డ్ బ్రెవిస్(14 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 22) టాప్ స్కోరర్‌గా నిలవగా.. మిగతా బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్(2/14), జస్‌ప్రీత్ బుమ్రా(2/17), వరుణ్ చక్రవర్తి(2/19), అక్షర్ పటేల్(2/7) రెండేసి వికెట్లు తీయగా.. హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే చెరో వికెట్ పడగొట్టారు. 176 పరుగుల లక్ష్య ఛేదనలో సౌతాఫ్రికాకు ఆశించిన ఆరంభం దక్కలేదు. ఒక్క పరుగు కూడా చేయకుండానే ఓపెనర్ క్వింటన్ డికాక్(0) డకౌటయ్యాడు. అర్ష్‌దీప్ సింగ్ బౌలింగ్‌లో క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. తన మరుసటి ఓవర్‌లో ట్రిస్టన్ స్టబ్స్(14)ను అర్ష్‌దీప్ సింగ్ క్లీన్ బౌల్డ్ చేశాడు. క్రీజులోకి డెవాల్డ్ బ్రెవిస్ రాగా.. కెప్టెన్ మార్క్‌రమ్ ఆచితూచి ఆడాడు. కానీ అక్షర్ పటేల్ తన తొలి బంతికే మార్క్‌రమ్(14)ను క్లీన్ బౌల్డ్ చేశాడు. దాంతో పవర్ ప్లేలో సౌతాఫ్రికా 3 వికెట్లకు 45 పరుగులు చేసింది. పవర్ ప్లే ముగిసిన వెంటనే డేవిడ్ మిల్లర్(1)ను హార్దిక్ పాండ్యా కీపర్ క్యాచ్‌గా పెవిలియన్ చేర్చాడు. ఆ తర్వాత వచ్చిన డోనోవన్ ఫెర్రెరియా(5)ను వరుణ్ చక్రవర్తి ఔట్ చేయగా.. దూకుడుగా ఆడిన డెవాల్డ్ బ్రెవిస్(22)ను జస్‌ప్రీత్ బుమ్రా క్యాచ్ ఔట్ చేశాడు. ఈ వికెట్‌తో టీ20ల్లో 100 వికెట్ల మైలురాయి అందుకున్నాడు. భారీ సిక్సర్ బాదిన మార్కో జాన్సెన్(12)ను మరుసటి బంతికే వరుణ్ చక్రవర్తి క్లీన్ బౌల్డ్ చేశాడు. కేశవ్ మహరాజ్(0)ను బుమ్రా క్యాచ్ ఔట్ చేయగా.. అన్రిచ్ నోర్ట్జ(1)ను అక్షర్ పటేల్ క్లీన్ బౌల్డ్ చేశాడు. లుతో సిప్లమా(2)ను దూబే ఆఖరి వికెట్‌గా పెవిలియన్ చేర్చడంతో సౌతాఫ్రికా ఇన్నింగ్స్ ముగిసింది. టీ20 క్రికెట్ చరిత్రలోనే సౌతాఫ్రికాకు ఇదే అత్యల్ప స్కోర్.



### గంభీర్ రాజకీయాలకు
## సంజూ బలి

టీమిండియా వికెట్ కీపర్ సంజూ శాంసన్‌కు మరోసారి నిరాశే ఎదురైంది. సౌతాఫ్రికాతో ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా కటక్ వేదికగా మంగళవారం జరిగిన తొలి టీ20లో అతనికి భారత తుది జట్టులో చోటు దక్కలేదు. వికెట్ కీపర్‌గా జితేష్ శర్మను తీసుకోవడంతో సంజూ శాంసన్ బెంచ్‌కే పరిమితమయ్యాడు. టీ20 ఫార్మాట్‌లో ఓపెనర్‌గా సత్తా చాటిన సంజూ శాంసన్‌ను వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కోసం బలి చేశారనే అభిప్రాయం సోషల్ మీడియా వేదికగా వ్యక్తమవుతుంది. శుభ్‌మన్ గిల్ కోసం ఓపెనింగ్ స్లాట్ త్యాగం చేసిన సంజూ శాంసన్‌కు మిడిలార్డర్‌లో అవకాశం కల్పించారు. ఆసియా కప్ 2025 టోర్నీలో సంజూ పర్వాలేదనిపించాడు. జితేష్ జట్టులోకి తీసుకొచ్చింది. సంజూ కంటే ఫినిషర్‌గా ఆడే సామర్థ్యం జితేష్ శర్మకు ఉండటంతో అతనికే అవకాశం కల్పించింది. ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ గంభీర్‌పై నెటిజన్లు విమర్శలు గుప్పిస్తు న్నారు. గంభీర్, అగార్కర్ రాజకీయాలకు శాంసన్ బలయ్యాడని కామెంట్ చేస్తున్నారు. గిల్, సూర్యకుమార్ వరుసగా విఫలమైనా.. జట్టులో కొనసాగుతున్నారని, కానీ సంజూ శాంసన్‌ను మాత్రం ఒక్క మ్యాచ్‌కే పక్కనపెట్టేసారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## షమీని ఎందుకు ఆడించడం లేదో?: గంగూలీ



చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్‌పై టీమిండియా మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ మరోసారి విరుచుకుపడ్డాడు. మహ్మద్ షమీని జాతీయ జట్టులోకి తీసుకోకపోవడంపై ప్రశ్నలు లేవనెత్తారు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలోని బెంగాల్ తరఫున షమీ అద్భుతంగా రాణించాడు. డొమెస్టిక్ క్రికెట్‌లో తన సామర్థ్యాన్ని నిరూపించుకున్నా.. జాతీయ జట్టు నుంచి పిలుపు అందలేదు. సయ్యద్ ముష్తాక్ అలీ టీ20 ట్రోఫీలో చివరి మూడు మ్యాచుల్లో కలిపి 11 వికెట్లు తీసి తన ఫామ్‌ను నిరూపించుకున్నాడు. గత కొంతకాలంగా షమీ-అగార్కర్ మధ్య విభేదాలు ఉన్నట్లుగా తెలుస్తున్నది. ఆస్ట్రేలియాతో పరిమిత ఓవర్ల సిరీస్‌కు షమీని ఎంపిక చేయకపోవడంతో అగార్కర్‌పై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. తాజాగా గంగూలీ సైతం అగార్కర్ లక్ష్యంగా విమర్శలు గుప్పించాడు. సెలెక్టర్లు గమనిస్తున్నారన్న విషయం తనకు తెలుసునన్నారు.

## బుమ్రా సరికొత్త రికార్డు

టీమిండియా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా చరిత్ర సృష్టించాడు. అంతర్జాతీయ టీ20ల్లో 100 వికెట్ల మైలురాయి అందుకున్నాడు. తద్వారా మూడు ఫార్మాట్లలో 100 వికెట్లు పడగొట్టిన తొలి భారత బౌలర్‌గా నిలిచాడు. సౌతాఫ్రికాతో కటక్ వేదికగా మంగళవారం జరిగిన మ్యాచ్‌లో బుమ్రా ఈ ఫీట్ సాధించాడు. డేంజరస్ బ్యాటర్ డెవాల్డ్ బ్రెవిస్(22)ను క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చడం ద్వారా టీ20ల్లో 100 వికెట్ ఖాతాలో వేసుకున్నాడు. ఇప్పటికే టెస్ట్‌ల్లో 234 వికెట్లు పడగొట్టిన బుమ్రా.. వన్డేల్లో 149 వికెట్లను ఖాతాలో వేసుకున్నాడు. తద్వారా మూడు ఫార్మాట్లలో 100 వికెట్లు తీసిన తొలి భారత బౌలర్‌గా.. ఓవరాల్‌గా ఐదో ప్లేయర్‌గా రికార్డుకెక్కాడు. లసిత్ మలింగ, షకిబ్ అల్ హసన్, టీమ్ సౌథీ, షాహిన్ అఫ్రిది మాత్రమే ఈ ఘనతను అందుకున్నారు. అంతేకాకుండా భారత్ తరఫున 100 వికెట్ల మైలురాయి అందుకున్న రెండో బౌలర్‌గా నిలిచాడు. అర్ష్‌దీప్ సింగ్(105 వికెట్లు) బుమ్రా కంటే ముందున్నారు.

## ప్రశాంతంగా ఉండడం నిశబ్దానికి సంకేతం కాదు

పెళ్లి రద్దు చేసుకున్న స్మృతి మంధాన మళ్లీ క్రికెట్‌పై దృష్టి సారిస్తోంది. బాలీవుడ్ సింగర్ పలాశ్ ముచ్చల్ తో బ్రేకప్ విషయాన్ని చాలా హుందాగా.. చాలా స్పష్టంగా చెప్పేసిన మంధాన.. తాజాగా మరో పోస్ట్‌తో వైరలవుతోంది. పెళ్లి రద్దు నిర్ణయంతో నెట్టింట సెంటర్ ఆఫ్ ది అట్రాక్షన్‌గా మారిన టీమిండియా స్టార్ ప్రశాంతంగా ఉండడం నిశబ్దంగా ఉన్నట్టు కాదని అంటోంది. ఎంతో సంబురంగా వివాహ వేడుకకు సిద్దమైన తను బ్రేకప్ నిర్ణయం తర్వాత మానసికంగా ఎలా ఉంది? అనే విషయాన్ని ఈ పోస్ట్‌తో స్పష్టం చేసింది వైస్ కెప్టెన్. 'ప్రశాంతంగా ఉండటం ద్వారా వివాదాలకు చెక్ పెట్టలేం అని చాలామంది అన్నారు. కానీ, నా మౌనమే మాట్లడగలదు. నా నమ్మకంతో ఎంతటి కష్టాన్నైనా దాటగలను. అందుకే నేను భయానికిలోనవ్వడం కంటే స్పష్టత ఇవ్వడానికి ప్రాధాన్యమిచ్చా. కొన్నాళ్లుగా ఓటములను స్వీకరిస్తూ వచ్చాను.



ఈవార్తలు
# ప్రజావాణి
సంపాదకీయం
నేటి ఈవార్తలు
బుధవారం 10-12-2025 | www.evarthalu.com




# మనిషిని మనిషిగా చూసేదెన్నడు?

మానవ హక్కులు.. కొందరికి ఈ పదం అంటే పడదు. కొందరికి ఈ పదం అంటే తెల్వదు. కొందరికి ఈ పదంతో లెక్కలేదు. మనిషిని మనిషిగా చూసే దిక్కే లేదు. భారత దేశంలో ప్రతి సందర్భంలో ఉల్లంఘనకు గురయ్యేది మానవ హక్కులే. మానవ హక్కులు అంటే అదేదో పనికిరాని పదంలా, నిషిద్ధ పదంలా చూసే రాజకీయ నాయకులు ఉన్నారు, అధికారులు ఉన్నారు, తోటి ప్రజలూ ఉన్నారు. కానీ, మైక్ ముందు మాత్రం మానవ హక్కులు కాపాడటంతో తామే ముందున్నామని డబ్బా కొట్టుకొనే డబ్బా రాయుళ్లెందరో. ఇలా మానవ హక్కులపై డబ్బా కొట్టుకొనేందుకూ ఓ రోజు ఉంది వాళ్లకు. అదే.. డిసెంబర్ 10. ఇదే రోజున అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం ఘనంగా, మైకులు అరిగిపోయేంత గొప్పగా జరుపుకుంటున్నాం. ఎంత గొప్పగా అంటే.. మానవ హక్కులను ఉల్లంఘిస్తూనే, మానవ హక్కుల గొప్పదనాన్ని చెప్పే అంత గొప్పగా.

**1948లో** ఐక్యరాజ్యసమితి ఆమోదించిన సార్వత్రిక మానవ హక్కుల ప్రకటనకు గుర్తే ఈ రోజు. ఇది కేవలం క్యాలెండర్‌లో ఒక తేదీ కాదు, ప్రతి పౌరుడి ప్రాథమిక గౌరవాన్ని, హక్కులను ప్రపంచానికి గుర్తుచేసే సందర్భం. ఈ ప్రకటన జాతి, లింగం, మతం లేదా సామాజిక నేపథ్యంతో సంబంధం లేకుండా ప్రతి వ్యక్తికి సమానమైన, గౌరవప్రదమైన హక్కులను హామీ ఇస్తుంది. మన హక్కులు, మన భవిష్యత్తు అనే నినాదంతో ఈ రోజును జరుపుకుంటున్న సందర్భంలో, భారతదేశంలో, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో మానవ హక్కుల ప్రస్తుత పరిస్థితిని విశ్లేషించడం అత్యవసరం. భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా, దాని రాజ్యాంగం పౌరులకు మత స్వేచ్ఛ, భావ ప్రకటనా స్వేచ్ఛ, చట్టం ముందు సమానత్వం వంటి ప్రాథమిక హక్కులను కల్పిస్తుంది. దేశంలో స్వతంత్ర న్యాయవ్యవస్థ, జాతీయ మానవ హక్కుల కమిషన్ వంటి సంస్థలు మానవ హక్కుల పరిరక్షణకు కృషి చేస్తున్నాయి. అయినప్పటికీ, అనేక సవాళ్లు ఇంకా పరిష్కరించబడలేదు. అనాదిగా పాతుకుపోయిన కుల వ్యవస్థ కారణంగా బడుగు, బలహీన వర్గాలు, దళితులు, ఆదివాసీలు తరచుగా వివక్షకు, హింసకు గురవుతున్నారు. దేశంలో మానవ హక్కుల ఉల్లంఘనకు మూలం సామాజిక అసమానతలు. కుల వ్యవస్థ ప్రాబల్యం, దళితులు, ఆదివాసీలు, వెనుకబడిన వర్గాలపై వివక్ష, హింసకు దారితీస్తోంది. ప్రభుత్వ లెక్కల ప్రకారమే ఈ వర్గాలపై జరిగే అత్యాచారాలు, నేరాలు ఆందోళనకరమైన స్థాయిలో ఉన్నాయి. వీరికి రాజ్యాంగపరమైన రక్షణలు ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో వాటి అమలు ప్రశ్నార్థకంగా ఉంది. ఈ వ్యవస్థీకృత వివక్ష మానవ హక్కుల ఉల్లంఘనకు ఒక ప్రధాన ఉదాహరణ. ఇక, జైళ్లలో రద్దీ, అపరిశుభ్రమైన పరిస్థితులు ఒక ప్రధాన సమస్యగా ఉన్నాయి. 'న్యాయం ఆలస్యమైతే, న్యాయం నిరాకరించబడినట్లే' అనే నానుడి భారతదేశంలో తరచూ రుజువవుతోంది. లక్షలాది కేసులు కోర్టుల్లో పెండింగ్‌లో ఉండటం వల్ల, విచారణ ఖైదీలు దశాబ్దాల తరబడి జైళ్లలోనే మగ్గిపోతున్నారు. ఇది స్వేచ్ఛగా జీవించే హక్కు, త్వరిత విచారణ పొందే హక్కుకు ప్రత్యక్ష ఉల్లంఘన. జైళ్లలో కిక్కిరిసిన రద్దీ, అపరిశుభ్రమైన పరిస్థితులు, సరైన వైద్య సదుపాయాలు లేకపోవడం ఖైదీల ప్రాథమిక మానవ హక్కులను కాలరాస్తున్నాయి. పత్రికా స్వేచ్ఛ, ఇంటర్నెట్ కంటెంట్‌పై ప్రభుత్వ లేదా న్యాయస్థానాల ద్వారా నిరోధిస్తున్న సంఘటనలు జరుగుతున్నాయి. ప్రజాస్వామ్యానికి మూలస్తంభమైన భావ ప్రకటనా స్వేచ్ఛ, పత్రికా స్వేచ్ఛ, విమర్శించే హక్కు ఇటీవల కాలంలో తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నాయి. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించిన జర్నలిస్టులు, కార్యకర్తలు, విద్యావేత్తలపై రాజద్రోహం వంటి కఠినమైన చట్టాల కింద కేసులు నమోదు చేయడం ఆందోళన కలిగిస్తోంది. ఇంటర్నెట్ షట్‌డౌన్‌లు మరియు కంటెంట్ బ్లాకింగ్‌లు సర్వసాధారణమవుతున్నాయి, ఇది సమాచారం పొందే పౌరుల హక్కును ఉల్లంఘిస్తోంది. దివ్యాంగుల సంక్షేమం కోసం చట్టాలు, మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం వంటి సానుకూల చర్యలు తీసుకుంటున్నప్పటికీ, అంతర్జాతీయ సంస్థలు మానవ హక్కుల ప్రమాణాలను స్థిరంగా పాటించడంలో దేశం బలహీనంగా వ్యవహరిస్తోంది. తెలుగు రాష్ట్రాల విషయానికి వస్తే.. అదే పరిస్థితి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో మానవ హక్కుల పరిరక్షణకు రాష్ట్ర మానవ హక్కుల కమిషన్లు ఉన్నాయి. కానీ, ఈ సంస్థల పనితీరులో తీవ్రమైన లోపాలు కనిపిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో మానవ హక్కుల కమిషన్ చైర్మన్, సభ్యుల పదవులు రెండేళ్లుగా ఖాళీగా ఉన్నాయి, ఇది మానవ హక్కుల పరిరక్షణ యంత్రాంగాన్ని బలహీనపరుస్తుంది. పనితీరులో ఆంధ్రప్రదేశ్ 23 రాష్ట్రాల్లో చివరి స్థానంలో ఉందని ఒక నివేదిక వెల్లడించింది. తెలంగాణలోనూ కొన్ని కేసులలో చర్య తీసుకోవడంలో జాప్యంపై జాతీయ మానవ హక్కుల కమిషన్ నిలదీసింది. ఈ సంస్థాగత వైఫల్యాలు, ముఖ్యంగా నియామకాలలో జాప్యం, బాధితులకు త్వరితగతిన న్యాయం అందించడంలో అడ్డంకిగా మారుతున్నాయి. మానవ హక్కుల దినోత్సవం కేవలం ఒక తంతుగా కాకుండా, ప్రతి మనిషికి గౌరవప్రదమైన జీవితాన్ని అందించాలనే ప్రాథమిక లక్ష్యాన్ని పునరుద్ఘాటించే రోజు. భారతదేశం, తెలుగు రాష్ట్రాలలో మానవ హక్కుల పరిరక్షణకు చట్టాలు, సంస్థలు ఉన్నప్పటికీ, వాటి సమర్థవంతమైన అమలులో లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రభుత్వాలు మానవ హక్కుల కమిషన్లలో ఖాళీలను తక్షణమే భర్తీ చేసి, వాటికి పూర్తి అధికారాలను కల్పించాలి. పౌర సమాజం, న్యాయవ్యవస్థ, మీడియా నిరంతరం అప్రమత్తంగా ఉంటూ, హక్కుల ఉల్లంఘనలను ప్రశ్నించినప్పుడే, వివక్ష లేని, సమానత్వం కలిగిన మానవ సమాజ నిర్మాణమనే లక్ష్యాన్ని మనం సాధించగలం.



రణధీర్ గుండు

# అత్యాశ, అమాయకత్వమే బలహీనత

ప్రతిరోజూ వార్తాపత్రికలలో, టీవీల్లో సైబర్ నేరాలకు సంబంధించిన వార్తలు చూస్తూనే ఉంటాం. లక్షలు పోగొట్టుకున్న బాధితుల ఆవేదన మనల్ని కలచివేస్తుంది. ఆధునిక సాంకేతిక ప్రపంచంలో సైబర్ నేరాలు ఒక పెను సవాలుగా మారాయి. ఈ నేరాలకు అనేక కారణాలు ఉండవచ్చు, కానీ లోతుగా విశ్లేషిస్తే, ఈ నేరాలన్నిటికీ మూల కారణం ఒకే ఒక్క మానవ బలహీనత: అదే 'అత్యాశ'. సైబర్ నేరగాడికి త్వరగా, కష్టపడకుండా డబ్బు సంపాదించాలనే అత్యాశ. అలాగే, ఆ నేరాలకు బల య్యే బాధితుడికి కూడా ఉచితంగా లేదా సులభంగా ఎక్కువ లాభం పొందాలనే అత్యాశ.

ఈ అత్యాశ అనే ఉమ్మడి బలహీనతే నేరగాడికి, బాధితుడికి మధ్య వారధిగా పనిచేస్తోంది. సైబర్ నేరాలకు పాల్పడేవారు సాధారణంగా శ్రమపడి పనిచేయడానికి ఇష్టపడరు. వారు తమ తెలివితేటలను, సాంకేతిక పరిజ్ఞానాన్ని సక్రమంగా ఉపయోగించి గౌరవప్రదంగా జీవించడానికి బదులుగా, అడ్డదారుల్లో, తక్కువ సమయంలో కోట్లు సంపాదించాలని ఆశపడతారు. ఫిషింగ్, ర్యాన్సమ్‌వేర్, ఆన్‌లైన్ మోసాలు వంటివన్నీ ఈ అత్యాశతోనే పుట్టుకొచ్చాయి. ఒక మెయిల్ పంపి, ఒక లింక్ క్లిక్ చేయించి, నిమిషాల్లో వేల, లక్షల రూపాయలు తమ ఖాతాల్లోకి మళ్లించుకోవాలనే దురాశే వారిని ఈ మార్గంలో నడిపిస్తుంది. కష్టపడే తత్వం కంటే, క్యాష్‌పై ఉండే మోజు, అత్యాశే వారిని క్రిమినల్స్‌గా మారుస్తుంది. మరి.. సైబర్ నేరగాళ్లు సృష్టించే ఉచ్చులో ప్రజలు ఎందుకు చిక్కుకుంటున్నారు? ఇక్కడ కేవలం



బాధితుల అమాయకత్వం మాత్రమే కారణం కాదు. ఉదాహరణకు, 'మీకు లాటరీలో కోటి రూపాయలు వచ్చాయి, ప్రాసెసింగ్ ఫీజుగా పదివేలు పంపండి' అనే సందేశం వచ్చినప్పుడు, 'నాకెందుకు ఉచితంగా వస్తుంది?' అని ఆలోచించే విచక్షణ కోల్పోతున్నారు. కోటి రూపాయల లాభంపై ఉన్న అత్యాశ, ఆ పదివేలు పంపేలా ప్రేరేపిస్తుంది. 'పార్ట్‌టైమ్ జాబ్ చేసి రోజుకు ఐదు వేలు సంపాదించండి' వంటి ప్రకటనలు చూసి, కష్టపడకుండా డబ్బు వస్తుందనే ఆశతో, వారు అడిగిన వివరాలు ఇచ్చి మోసపోతారు. ఒకవేళ ప్రజలకు అత్యాశ లేకపోతే, ఉచితంగా వచ్చే భారీ లాభాలను నమ్మకపోతే, సైబర్ నేరగాళ్ల ఎత్తుగడలు చాలా వరకు విఫలమవుతాయి. అందుకే.. సైబర్ నేరాలకు నివారణకు మార్గం: అత్యాశను వీడటమే. సైబర్ నేరాలను కేవలం సాంకేతిక రక్షణలతో మాత్రమే పూర్తిగా అరికట్టలేం. సాంకేతికతతో పాటు, మానసికమైన మార్పు కూడా అవసరం. ఉచితంగా ఏదీ రాదని, కష్టపడకుండా డబ్బు సంపాదించడం సాధ్యం కాదని ప్రతి ఒక్కరూ గుర్తించాలి. ఆన్‌లైన్‌లో పరిచయమైన వ్యక్తులు ఇచ్చే భారీ ఆఫర్లను గుడ్డిగా నమ్మకూడదు. సైబర్ నేరాల గురించి, అవి జరిగే విధానం గురించి ప్రజలకు నిరంతరం అవగాహన కల్పించాలి. సైబర్ నేరాల వెనుక ఉన్న 'అత్యాశ' అనే వైరస్‌ను మనం మానసికంగా ఎదుర్కోగలిగితేనే ఈ నేరాలను సమర్థవంతంగా అరికట్టగలం.



వినోద్ కుమార్

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.